పక్కా తెలుగు

PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 024 | శనివారం | 18-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 024 | Saturday | 18-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




## హైకోర్టు గ్రీన్ సిగ్నల్

»నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ

»సరూర్‌నగర్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు

బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే కొన్ని షరతులను కూడా విధించింది. సభ కారణంగా హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకూడదని ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలిగించకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించింది. పోలీసులు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

(వివరాలు 2లో..)

### యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర

• అనుమతిని అడ్డుకోవాలని చూశారన్న కేటీఆర్

హైకోర్టు తీర్పు తర్వాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. యువ సంగ్రామ సదస్సును అడ్డుకుని నిరుద్యోగ యువత గొంతు నొక్కాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించినా ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ హైకోర్టు సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా యువత తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## ధరణి అక్రమాలపై సిట్

### మంత్రివర్గం కీలక నిర్ణయాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో ధరణి అక్రమాలు, గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ రైలు, విద్య, గృహ నిర్మాణం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజా సంక్షేమం, పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధి పనులకు వేగం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది.

(వివరాలు 2లో..)




## బీకేర్‌ఫుల్

ట్రంప్ తలకు వెల • వంద కోట్ల నజరానా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసిన వారికి 10 మిలియన్ డాలర్లు, అంటే సుమారుగా 100 కోట్ల రూపాయల బహుమతి ప్రకటించినట్లు ఇరాన్‌కు మద్దతుగా పనిచేస్తున్న ఇరాక్ మిలీషియా కూటమి ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్ (ఐఆర్ఐ) వెల్లడించింది. 2020లో అమెరికా డ్రోన్ దాడిలో ఇరాన్ సైనికాధికారి ఖాసెం సోలైమానీ, ఇరాక్ కమాండర్ అబూ మహ్దీ అల్‌ముహందిస్ మరణాలకు ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రకటన అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారి తీసింది.



## దేవాదాయ శాఖలో కొత్త అధ్యాయం

### 191 మందికి ఉద్యోగ అవకాశాలు

తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఇప్పటివరకు ఇంత పెద్ద స్థాయిలో దేవాదాయ శాఖలో నియామకాలు జరగలేదని ప్రభుత్వం పేర్కొంది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా పలువురు అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

(వివరాలు 2లో..)


## ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

### నగదురహిత వైద్యానికి శ్రీకారం

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ను అధికారికంగా ప్రారంభించింది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదురహిత వైద్య సేవలు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది.


(వివరాలు 2లో..)






## అమెరికాను సర్వనాశనం చేసేశాం

కోలుకోలేని దెబ్బతీశామన్న ఇరాన్



## మహా పవర్ పోరాటం

### ఎన్సీపీ ఎత్తులు.. బీజేపీ షరతులు

మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ భవిష్యత్తుపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. రెండు వర్గాల విలీనం, ఎన్డీఏలో చేరిక, పార్టీలో అంతర్గత విభేదాలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారాయి. శరద్ పవార్ వర్గం ఎన్డీఏలో చేరే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్న వేళ బీజేపీ తన వైఖరిని స్పష్టం చేసినట్లు సమాచారం. విడిపోయిన ఎన్సీపీ వర్గాలు ఒక్కటైతే మాత్రమే కూటమిలో చోటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎన్సీపీకి చెందిన పలువురు కీలక నేతలు వరుసగా భేటీ కావడం కొత్త సందేహాలకు తావిచ్చింది. పార్టీలో నాయకత్వంపై అసంతృప్తి, సీనియర్ నేతల మధ్య విభేదాలు, పార్థ్ పవార్ ప్రాధాన్యంపై చర్చలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఎన్సీపీలో విలీనమే జరుగుతుందా, మరో చీలికకు దారితీస్తుందా, లేక కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయా అన్న ఆసక్తి మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొంది. (వివరాలు 3లో..)

### మహారాష్ట్ర రాజకీయాల్లో కలకలం

ఎన్సీపీలో విలీనమా? మరో చీలికా?

మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ భవిష్యత్తుపై కొత్త చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎన్సీపీ కీలక నేతలు వరుసగా సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. తొలుత ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే ముఖ్యమంత్రిని కలిశారు. మరుసటి రోజు అజిత్ పవార్ కుమారుడు, పార్టీ ఎంపీ పార్థ్ పవార్ కూడా ఫడ్నవీస్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశాలపై ఇరు వర్గాలు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

### ఎన్సీపీపై బీజేపీ స్పష్టత

• విలీనం అయితేనే ఎన్డీఏలోకి

• అసలు విషయాన్ని చెప్పిన పెద్దలు

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ఎన్డీఏలో చేరవచ్చన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ తన వైఖరిని స్పష్టం చేసింది. ప్రస్తుతం విడిపోయిన ఎన్సీపీ వర్గాలు ఒకటిగా ఏకమైతే మాత్రమే ఎన్డీఏలో చోటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని పార్టీ అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. విడివిడిగా ఏ వర్గాన్నీ కూటమిలో చేర్చే ఆలోచన లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు

• కాళేశ్వరంపై విమర్శలు.. కానీ నీళ్లపై ఆధారమా!

• ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్ నగరంలో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25 నుంచి 30 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని నగరానికి తరలించాలని నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు సుమారు నాలుగు కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. (వివరాలు 2లో..)





## 75 అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభం

పంజాబ్‌కు రూ.5,470 కోట్ల వరాలు

భారీ ప్రాజెక్టుల ప్రారంభించిన మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్‌లోని జలంధర్‌లో రూ.5,470 కోట్ల విలువైన రైల్వే, జాతీయ రహదారి అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వడం లక్ష్యంగా రూపొందించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో డేరా సచ్‌ఖండ్ బల్లాన్‌ను సందర్శించిన తర్వాత జలంధర్‌కు మోదీ రావడం ఇది రెండోసారి. (వివరాలు 2లో..)

### దేశంలో తొలి హైడ్రోజన్ రైలు

రూ.5తోనే ప్రయాణం

ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పే అమెరికా... ఇప్పుడు తన ఇంటి తాళాలు ఎక్కడ పోయాయో వెతుక్కుంటున్నట్టుంది. ప్రపంచ దేశాల ఎన్నికలపై వేలెత్తి చూపే వాషింగ్టన్‌కు, ఇప్పుడు తన ఓటర్ల సమాచారమే చైనా చేతిలో పడిందన్న ఆరోపణ రాజకీయంగా పెద్ద సంచలనమే. అయితే ఇది నిజంగానే జాతీయ భద్రతా హెచ్చరికా? లేక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ పాత గాయంపై కొత్త కట్టు కట్టే రాజకీయ వ్యూహమా? ట్రంప్ ఆరోపణలు వింటే చైనా అమెరికా ఎన్నికల గదిలోనే కూర్చుని ఓట్లు లెక్క పెట్టిందేమో అనిపిస్తుంది. కానీ ఇప్పటివరకు బయటకు వచ్చిన ఆధారాలు మాత్రం అంతటి సంచలనానికి పూర్తి బలం ఇవ్వడం లేదు. ఒకవైపు "డేటా డ్రాగన్" కథనం... మరోవైపు "ఆధారాలు ఎక్కడ?" అనే ప్రశ్న. ఎన్నికల భద్రత పేరుతో మొదలైన ఈ చర్చలో రాజకీయ లెక్కలు, ప్రచార వ్యూహాలు, జాతీయ భద్రత అంశాలు అన్నీ కలిసిపోవడంతో అమెరికా రాజకీయ రంగస్థలం మరోసారి వేడెక్కింది. ఇప్పుడు అసలు ఆసక్తి ట్రంప్ చేసిన ఆరోపణల్లో కాదు... వాటిని నిరూపించే ఆధారాలు నిజంగా బయటకు వస్తాయా లేదా అన్నదానిపైనే ఉంది.




## నిజమా..అబద్ధమా..!

సంచలనమా? ఆరోపణా? • చైనా చేతికి అమెరికా సమాచారం?

ట్రంప్ ఆరోపణలను కొట్టిపారేసిన డ్రాగన్

### అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం?


• ట్రంప్ ఆరోపణలతో కొత్త దుమారం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి 2020 అధ్యక్ష ఎన్నికల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. చైనా అమెరికా ఎన్నికల డేటాలో జోక్యం చేసుకుందని, 22 కోట్ల మంది అమెరికా ఓటర్ల వివరాలు చైనా చేతికి చేరాయని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, దీనికి సంబంధించిన కీలక నిఘా సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానం నమ్మకాన్ని కోల్పోయిందని కూడా విమర్శించారు.

### చైనా చేతికి అమెరికా సమాచారం?

• ఓటర్ల డేటాపై ట్రంప్ కొత్త ఆరోపణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఎన్నికల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. 2020 నుంచి అమెరికాకు చెందిన 22 కోట్ల మంది ఓటర్ల వ్యక్తిగత వివరాలు చైనా చేతికి చేరాయని ఆయన ఆరోపించారు. పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, రాజకీయ అనుబంధ సమాచారం వంటి కీలక వివరాలను బీజింగ్ సేకరించిందని పేర్కొన్నారు. అమెరికా నిఘా సంస్థలకు ఈ విషయం తెలిసినా తనకు తెలియజేయలేదని కూడా ట్రంప్ విమర్శించారు. అయితే ఈ చర్య ఎన్నికల ఫలితాలను మార్చిందని మాత్రం ఆయన నేరుగా చెప్పలేదు.




## స్కూల్లో మత బోధన వివాదం

తల్లిదండ్రుల ఫిర్యాదు

సైదాబాద్‌లో కేసు నమోదు

# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ
- సరూర్‌నగర్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు




బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే కొన్ని షరతులను కూడా విధించింది. సభ కారణంగా హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకూడదని ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలిగించకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించింది. పోలీసులు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

**యువత హామీలే ప్రధాన అజెండా**

ఈ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను గుర్తు చేయాలని బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని బీఆర్ఎస్ యువజన నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ యువతను నిరాశపరిచిందని విమర్శిస్తున్నారు. యువ సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ సభ ముఖ్య ఉద్దేశమని పార్టీ నేతలు చెబుతున్నారు.

**పోలీసుల నిరాకరణ.. కోర్టు జోక్యం**

సభ నిర్వహణకు రెండు వారాల క్రితమే పోలీసుల అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే నిర్ణయం వెలువడకపోవడంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా 17 రోజుల పాటు నిర్ణయం ఎందుకు తీసుకోలేదని కోర్టు పోలీసులను ప్రశ్నించింది. అనంతరం సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సభకు ఎదురైన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

**కేటీఆర్ హాజరు.. భారీగా తరలిరావాలంటూ పిలుపు**

యువ సంగ్రామ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో సభకు రావాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు.
సరూర్‌నగర్ స్టేడియం మరోసారి యువత సమస్యలపై రాజకీయ చర్చకు వేదిక కానుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. సభలో యువతకు సంబంధించిన డిమాండ్లపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# యువ సంగ్రామ సదస్సుపై రేవంత్ కుట్ర



**అనుమతిని అడ్డుకోవాలని చూశారన్న కేటీఆర్**

హైకోర్టు తీర్పు తర్వాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. యువ సంగ్రామ సదస్సును అడ్డుకుని నిరుద్యోగ యువత గొంతు నొక్కాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించినా ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ హైకోర్టు సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా యువత తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**యువతకు బీఆర్ఎస్ పిలుపు**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ప్రకటించిన హామీలు నెరవేర్చలేదని విమర్శిస్తోంది. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికే యువ సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకత్వం వెల్లడించింది. పెద్ద సంఖ్యలో యువత, నిరు ద్యోగులు సరూర్‌నగర్ స్టేడియానికి తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**కోర్టు ప్రశ్నలు.. షరతులతో అనుమతి**

సదస్సుకు రెండు వారాలకు పైగా ముందే అనుమతి కోసం దరఖాస్తు చేసినా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని హైకోర్టు ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. భద్రత, పార్కింగ్ సమస్యలు ఉన్నాయని ముందుగానే నిర్వాహకులకు ఎందుకు తెలియజేయలేదని కూడా నిలదీసింది. అనంతరం అవసరమైన షరతులు విధిస్తూ సభ నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఈ పరిణామంతో యువ సంగ్రామ సదస్సు చుట్టూ రాజకీయ వేడి మరింత పెరిగింది.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

## నగదురహిత వైద్యానికి శ్రీకారం

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ను అధికారికంగా ప్రారంభించింది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదురహిత వైద్య సేవలు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది.




**• లక్షల మందికి ఆరోగ్య భద్రత**

ఈ పథకం ద్వారా సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 29.80 లక్షల మందికి ఆరోగ్య రక్షణ కలగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, కేర్, మెడికవర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులు కూడా ఈ పథకంలో భాగమయ్యాయి. సీజీహెచ్ఎస్ ప్యాకేజీల ప్రకారం 1,816 రకాల వైద్య సేవలు, శస్త్రచికిత్సలు పూర్తిగా నగదురహితంగా అందుబాటులో ఉంటాయి.

**• పూర్తిగా డిజిటల్ విధానం**

ప్రీ అథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యంతో ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఉద్యోగుల చందాకు సమానంగా ప్రభుత్వం కూడా తన వాటా అందించనుంది. ప్రస్తుతం ఉన్న 12 వెల్‌నెస్ సెంటర్లతో పాటు మరో 24 కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయాలని నిర్ణయించారు.

**• భట్టి కీలక వ్యాఖ్యలు**

ఉద్యోగులు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలయ్యే పరిస్థితిని పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రుల ఉపసంఘం ఉద్యోగ సంఘాలతో విస్తృతంగా చర్చించి ఈ పథకాన్ని రూపొందించిందన్నారు. ఉద్యోగులకు నమ్మకమైన ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని వివరించారు.

**• పెండింగ్ బిల్లుల చెల్లింపుపైనా స్పష్టత**

గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల వైద్య బిల్లులను తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తోందని భట్టి వెల్లడించారు. ప్రతి నెలా భారీ మొత్తంలో నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసే కీలక వారధులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కొత్త ఆరోగ్య పథకం ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు నాణ్యమైన వైద్య సేవలను అందించే కీలక సంస్కరణగా నిలవనుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.

# మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు

- కాళేశ్వరంపై విమర్శలు.. కానీ నీళ్లపై ఆధారమా!
- ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ కేటీఆర్

**వర్షాభావానికి ముందస్తు ప్రణాళిక**

వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించాలని జలమండలి కార్యాచరణ రూపొందించింది. నగరానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, రానున్న నెలల్లో పెరిగే డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. భవిష్యత్తులో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది.

**ప్రభుత్వంపై కేటీఆర్ ప్రశ్నలు**

ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పనికిరాదని విమర్శించిన ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ జలాశయం నుంచి హైదరాబాద్‌కు తాగునీరు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు.



# దేవాదాయ శాఖలో కొత్త అధ్యాయం

## వివిధ విభాగాల్లో భర్తీలు



రాష్ట్రంలోని 47 ప్రధాన దేవాలయాల కోసం పురోహితులు, వేదపండితులు, పరిచారకులు, వాహన పూజ పురోహితులు, అసిస్టెంట్ కుక్‌లు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం కళాకారులు సహా పలు విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టారు. ఆలయాల్లో నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ భర్తీలు దోహదపడతాయని ప్రభుత్వం తెలిపింది. దేవాలయ ఉద్యోగాన్ని కేవలం ఉపాధిగా చూడొద్దని మంత్రి కొండా సురేఖ సూచించారు. భగవంతునికి సేవ చేసే పవిత్ర బాధ్యతగా భావించి ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని కోరారు. భక్తులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా దేవాలయాలపై విశ్వాసం మరింత బలపడుతుందని చెప్పారు. అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, వంట సిబ్బంది సమిష్టి సేవతో ఆలయాల వైభవం మరింత పెరుగుతుందని వివరించారు.

**వరుణయాగాలకు ప్రభుత్వం సిద్ధం**

దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ ద్వారా అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరింత మెరుగైన ప్రయోజనాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు నిర్వహించేందుకు త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు. పనితీరు ఆధారంగా అన్ని విభాగాల ఉద్యోగులకు అవార్డులు అందించే విధానాన్ని కూడా అమలు చేస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో త్వరలో వరుణయాగాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఎంతోకాలంగా ఎదురుచూసిన ఉద్యోగ అవకాశాలు రావడంతో నియామక పత్రాలు అందుకున్న పలువురు అభ్యర్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ నియామకాలు దేవాదాయ శాఖ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది.

# 75 అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభం

- పంజాబ్‌కు రూ.5,470 కోట్ల వరాలు
- భారీ ప్రాజెక్టుల ప్రారంభించిన మోదీ



**75 అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభం**

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశంలోని 20 రాష్ట్రాల్లో అభివృద్ధి చేసిన 75 రైల్వే స్టేషన్లను ప్రధాని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.1,570 కోట్లతో ఈ స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. పంజాబ్‌లోని జలంధర్ కంటోన్మెంట్, ఎస్ఏఎస్ నగర్ (మొహాలీ), శ్రీ ముక్తసర్ సాహిబ్, శ్రీ ఆనంద్‌పూర్ సాహిబ్ స్టేషన్లు కూడా ఇందులో ఉన్నాయి. స్థానిక సంస్కృతి, వారసత్వం, నిర్మాణ శైలిని ప్రతిబింబించేలా వీటిని తీర్చిదిద్దారు.

**కొత్త రైలు మార్గాలకు శ్రీకారం**

దౌలత్‌పూర్ చౌక్-కర్తోలి కొత్త రైల్వే మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. సుమారు రూ.830 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మధ్య రైల్వే అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయనుంది. కర్తోలి-అంబాలా రైలు సేవకు కూడా పచ్చజెండా ఊపారు. అమృత్‌సర్-వారణాసి సంత్ రవిదాస్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించడం ద్వారా రెండు ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య నేరుగా రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

**జాతీయ రహదారుల అభివృద్ధికి ఊతం**

రూ.3,070 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేలో భాగమైన 30.9 కిలోమీటర్ల నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ మార్గాన్ని ప్రారంభించారు. అలాగే 25.2 కిలోమీటర్ల ఆరు లేన్ల లూధియానా దక్షిణ బైపాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఇంధన వినియోగం కూడా తగ్గనుంది.

**రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్న పర్యటన**

2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం కూడా ఏర్పడింది. రాష్ట్రంలో స్వతంత్రంగా పోటీకి సిద్ధమవుతున్న బీజేపీకి ఈ పర్యటన కీలకంగా భావిస్తున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించిందనే సందేశాన్ని ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరవేసే ప్రయత్నం జరిగింది. అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు ప్రాంతీయ అనుసంధానం, ఆర్థిక కార్యకలాపాలకు కొత్త ఊపు లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# దేశంలో తొలి హైడ్రోజన్ రైలు

**రూ.5తోనే ప్రయాణం**

దేశంలో తొలి హైడ్రోజన్ ఇంధన రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. హర్యానాలోని జింద్-సోనిపట్ రైల్వే మార్గంలో ఈ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ రైలు పర్యావరణహిత రవాణా దిశగా భారత రైల్వేకు కొత్త అధ్యాయంగా నిలుస్తోంది. డీజిల్‌పై ఆధారాన్ని తగ్గిస్తూ కాలుష్యాన్ని నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం తెలిపింది.

**టికెట్ ధర కేవలం రూ.5**

ఈ రైలులో ప్రయాణికులకు అత్యంత ఆకర్షణీయమైన అంశం టికెట్ ధర. కనిష్ఠ చార్జీ కేవలం రూ.5 మాత్రమే. ప్రయాణ దూరాన్ని బట్టి గరిష్ఠంగా రూ.25 వరకు టికెట్ ధర ఉంటుంది. ప్రారంభ ప్రయాణంలో పాల్గొన్న పలువురు ప్రయాణికులు రూ.5 టికెట్లతోనే ప్రయాణించారు. తక్కువ ధరతో ఆధునిక సాంకేతికత కలిగిన రైలులో ప్రయాణించే అవకాశం కల్పించడం విశేషంగా మారింది.

**జింద్ నుంచి సోనిపట్ వరకు**

ఈ హైడ్రోజన్ రైలు జింద్ జంక్షన్ నుంచి సోనిపట్ వరకు నడుస్తుంది. మధ్యలో పలు చిన్న స్టేషన్లలో ఆగుతుంది. గంటకు గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో నడిచేందుకు అనుమతి ఇచ్చారు. దీని రూపకల్పన వేగం గంటకు 110 కిలోమీటర్లు. ఈ మార్గంలో ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**ప్రత్యేకత ఏమిటి?**

సాధారణ రైళ్లలా డీజిల్ లేదా ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లపై ఈ రైలు ఆధారపడదు. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ద్వారా విద్యుత్‌ను రైలులోనే ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ చర్య వల్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఉప ఉత్పత్తులుగా నీటి ఆవిరి, వేడి మాత్రమే విడుదల అవుతాయి. దీంతో గాలి కాలుష్యం దాదాపు ఉండదు. ఈ రైలులో రెండు హైడ్రోజన్ పవర్ కార్లు, ఎనిమిది కోచ్‌లు ఉన్నాయి. సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంది. హైడ్రోజన్ లీకేజీ, పొగ, మంటలు, అధిక ఉష్ణోగ్రతలను గుర్తించే అత్యాధునిక భద్రతా వ్యవస్థలు కూడా ఏర్పాటు చేశారు.

**భారత్ ప్రపంచ సరసన**

ఈ ప్రాజెక్టుతో జింద్‌లో దేశంలోనే అతిపెద్ద రైల్వే హైడ్రోజన్ నిల్వ, రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. దాదాపు 3 వేల కిలోల హైడ్రోజన్ నిల్వ చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా దీనిని నిర్మించారు. ఈ రైలు ప్రారంభంతో జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారత్ కూడా హైడ్రోజన్ రైలు సాంకేతికతను అమలు చేస్తున్న దేశాల జాబితాలో చేరింది. పరిశుభ్రమైన, సుస్థిర రవాణా వ్యవస్థ వైపు భారత రైల్వే మరో కీలక అడుగు వేసిందని అధికారులు పేర్కొన్నారు.

# ధరణి అక్రమాలపై సిట్

**మంత్రివర్గం కీలక నిర్ణయాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో ధరణి అక్రమాలు, గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ రైలు, విద్య, గృహ నిర్మాణం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజా సంక్షేమం, పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధి పనులకు వేగం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది.

**ధరణిపై సిట్ దర్యాప్తు**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి భూ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయనుంది. ధరణి ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు కూడా పచ్చజెండా ఊపింది. భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, వక్ఫ్ భూములు, దేవాదాయ భూముల లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**ప్రాజెక్టుల వ్యయాల పెంపు**

దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ నీటిపారుదల ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన నిధులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఒకవైపు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూనే, మరోవైపు ధరణి అక్రమాలపై సమగ్ర విచారణకు సిట్ ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



**పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ**

గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాల్సిన అవసరం ఉండదు. నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలోనే జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనులకు నిధులు వెంటనే వినియోగించే అవకాశం లభించనుంది. ఈ సవరణను అమల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వం త్వరలో ఆర్డినెన్స్ జారీ చేయనుంది. జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపునకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనను కూడా ఆమోదించింది.

# స్కూల్లో మత బోధన వివాదం

- తల్లిదండ్రుల ఫిర్యాదు
- సైదాబాద్‌లో కేసు నమోదు

హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో మత బోధనపై వివాదం చెలరేగింది. రెండో తరగతి చదువుతున్న విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించారంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై ప్రాథమిక సమాచార నివేదిక నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.

**ప్రార్థనలు చేయాలని ఒత్తిడి ఆరోపణ**

తమ కుమారుడితో తరగతి గదిలో సూరా అల్ ఫాతిహా పఠనం చేయించారని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రతిరోజూ అదే ప్రార్థన చదవాలని స్కూల్ డైరీలో కూడా నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా ఈ చర్యలు జరిగాయని, ఉపాధ్యాయుల ఒత్తిడి కారణంగా బాలుడు మానసిక ఆందోళనకు గురయ్యాడని తెలిపారు. ప్రతిరోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని కూడా వివరించారు.



**ప్రిన్సిపాల్ సహా పలువురిపై కేసు**

ఫిర్యాదు ఆధారంగా పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, సంబంధిత తరగతి ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడిపై మానసిక ఒత్తిడి తీసుకొచ్చారా లేదా అనే కోణంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని వివరాలు సేకరించిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సైదాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఘటనతో విద్యాసంస్థల్లో మతపరమైన బోధన, విద్యార్థుల హక్కుల అంశంపై మరోసారి చర్చ మొదలైంది.



# బీ కేర్‌ఫుల్

## ట్రంప్ తలకు వెల . వంద కోట్ల నజరానా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసిన వారికి 10 మిలియన్ డాలర్లు, అంటే సుమారుగా 100 కోట్ల రూపాయల బహుమతి ప్రకటించినట్లు ఇరాన్‌కు మద్దతుగా పనిచేస్తున్న ఇరాక్ మిలీషియా కూటమి ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్ (ఐఆర్ఐ) వెల్లడించింది. 2020లో అమెరికా డ్రోన్ దాడిలో ఇరాన్ సైనికాధికారి ఖాసెం సోలైమానీ, ఇరాక్ కమాండర్ అబూ మహ్దీ అల్‌ముహందిస్ మరణాలకు ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రకటన అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారి తీసింది.

**విరాళాలతో నిధుల సమీకరణ**

ఇరాన్‌కు చెందిన మీడియా కథనం ప్రకారం, ఈ బహుమతి మొత్తాన్ని సంస్థ సభ్యులు, మద్దతుదారులు ఇచ్చిన విరాళాల ద్వారా సేకరించినట్లు పేర్కొన్నారు. జూలై 16న విడుదల చేసిన ప్రకటనలో ట్రంప్‌ను హత్య చేసే వ్యక్తికి, అలాంటి చర్యకు సహకరించే వ్యక్తి, సంస్థ, సమూహానికి కూడా ఈ బహుమతి వర్తిస్తుందని వెల్లడించింది. ట్రంప్ తన పాత్రపై గర్వంగా మాట్లాడటమే ఈ నిర్ణయానికి కారణమని ఆ సంస్థ పేర్కొంది.

**ట్రంప్ వ్యాఖ్యలతో మళ్లీ వివాదం**

వైట్‌హౌస్‌లో ఇరాక్ ప్రధానమంత్రి అలీ అల్‌జైదీతో జరిగిన సమావేశంలో ట్రంప్ 2020 డ్రోన్ దాడిని మరోసారి ప్రస్తావించారు. సోలైమానీని తొలగించడం వల్ల అమెరికాకు పెద్ద ముప్పు తప్పిందని ఆయన వ్యాఖ్యానించారు. అదే ఘటనలో ఇరాక్‌కు చెందిన మరో కీలక నేత కూడా మరణించాడని ట్రంప్ చెప్పారు. ఆ సమయంలో తాను రాజకీయాల్లో లేనని ఇరాక్ ప్రధాని సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలపై అల్‌ముహందిస్ కుటుంబ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**గతంలోనూ హత్యాయత్నాలు**

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగాయి. పెన్సిల్వేనియాలో జరిగిన సభలో కాల్పులు చోటుచేసుకోగా ట్రంప్ చెవికి స్వల్ప గాయం అయింది. కొద్ది వారాల తర్వాత ఫ్లోరిడాలోని ఆయన గోల్ఫ్ క్లబ్ సమీపంలో మరో కుట్రను అమెరికా భద్రతా సిబ్బంది ముందుగానే అడ్డుకున్నారు. ఈ సంఘటనలు ట్రంప్ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచాయి.

**అమెరికా ఆరోపణలు.. ఇరాన్ ఖండన**

ట్రంప్ హత్యకు కుట్ర పన్నేందుకు ఇరాన్‌కు అనుబంధంగా ఉన్న వ్యక్తులు ప్రయత్నించినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు గతంలో ఆరోపించాయి. సోలైమానీ మరణానికి ప్రతీకారంగా ఈ ప్రయత్నాలు జరిగాయని అమెరికా వాదించింది. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ పూర్తిగా ఖండించింది. తాజా బహుమతి ప్రకటనతో అమెరికా-ఇరాన్ సంబంధాలు మరోసారి ఉద్రిక్త దశలోకి వెళ్లే అవకాశాలపై అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# అమెరికాను సర్వనాశనం చేసేశాం

## కోలుకోలేని దెబ్బతీశామన్న ఇరాన్

గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారంగా జోర్డాన్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన అనేక ఇంధన నింపే విమానాలు, యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయని, మరికొన్నింటికి తీవ్ర నష్టం వాటిల్లిందని వెల్లడించింది. అయితే ఈ వాదనను స్వతంత్రంగా ధృవీకరించే ఆధారాలు ఇప్పటివరకు వెలువడలేదు. అమెరికా సైన్యం కూడా దీనిపై వెంటనే స్పందించలేదు.

**ప్రతీకార దాడులేనన్న ఇరాన్, పలు దేశాలపై ప్రభావం**

ఇటీవల అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం ఎనిమిది మంది మరణించారని ఇరాన్ పేర్కొంది. అదే ఘటనకు ప్రతీకారంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. సిరియాలోని అల్‌తన్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా ప్రత్యేక దళాల కమాండ్ కేంద్రాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జోర్డాన్‌లోని అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవాలని అక్కడి ప్రజలకు కూడా పిలుపునిచ్చినట్లు సమాచారం. ఈ ఘర్షణ ప్రభావం జోర్డాన్‌కే పరిమితం కాలేదు. ఖతార్‌పై కొత్త క్షిపణి దాడులు జరిగినట్లు సమాచారం. కువైట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ, సముద్ర జలాలను తాగునీటిగా మార్చే ప్లాంట్ దెబ్బతిన్నట్లు కథనాలు వెల్లడించాయి. ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్, సులైమానియా ప్రాంతాల్లో కూడా పేలుళ్లు వినిపించాయి. అక్కడి వైమానిక రక్షణ వ్యవస్థలు క్షిపణులను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాయి.



కొన్ని దాడుల్లో ప్రాణనష్టం కూడా జరిగినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

**పెరుగుతున్న అంతర్జాతీయ ఆందోళన**

గత నెల కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ పూర్తిగా కూలిపోయింది. హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్య పోరు మరింత తీవ్రమైంది. అమెరికా ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, రవాణా వ్యవస్థలపై దాడులను విస్తరించింది. హోర్మోజ్‌గాన్ ప్రాంతంలో రహదారులు, రైల్వే మార్గాలు దెబ్బతిన్నాయని ఇరాన్ తెలిపింది. పలు నగరాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దక్షిణ తీర ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. ఇరాన్ ప్రకారం అమెరికా దాడుల్లో ఇప్పటికే పలువురు మరణించగా వందలాది మంది గాయపడ్డారు. తాజా పరిణామాలతో మధ్యప్రాచ్య పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. అమెరికా, ఇరాన్ పరస్పర ఆరోపణలు కొనసాగుతుండగా ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్ చేసిన విమానాల విధ్వంసం, భారీ నష్టం ఆరోపణలపై స్వతంత్ర నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

# చైనా చేతికి అమెరికా సమాచారం?

## ఓటర్ల డేటాపై ట్రంప్ కొత్త ఆరోపణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఎన్నికల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. 2020 నుంచి అమెరికాకు చెందిన 22 కోట్ల మంది ఓటర్ల వ్యక్తిగత వివరాలు చైనా చేతికి చేరాయని ఆయన ఆరోపించారు. పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, రాజకీయ అనుబంధ సమాచారం వంటి కీలక వివరాలను బీజింగ్ సేకరించిందని పేర్కొన్నారు. అమెరికా నిఘా సంస్థలకు ఈ విషయం తెలిసినా తనకు తెలియజేయలేదని కూడా ట్రంప్ విమర్శించారు. అయితే ఈ చర్య ఎన్నికల ఫలితాలను మార్చిందని మాత్రం ఆయన నేరుగా చెప్పలేదు.

**పత్రాలు విడుదల చేసిన వైట్‌హౌస్**

ట్రంప్ ప్రసంగంతో పాటు వైట్‌హౌస్ "ఎలెక్షన్ ఇంటిగ్రిటీ" పేరుతో కొత్త విభాగాన్ని ప్రారంభించింది. గతంలో రహస్యంగా ఉంచిన కొన్ని పత్రాలను బహిర్గతం చేసింది. అమెరికా ఎన్నికల వ్యవస్థపై రష్యా, చైనా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు సాంకేతికంగా ప్రభావం చూపే సామర్థ్యం కలిగి ఉన్నాయని కొన్ని నిఘా అంచనాలను అందులో ప్రస్తావించింది. వెనిజులా ఎన్నికల సాంకేతికతపై వచ్చిన పాత నివేదికలు, ఓటరు నమోదు వివాదాలకు సంబంధించిన సమాచారం కూడా విడుదల చేసింది. ట్రంప్ చేసిన ఆరోపణలపై సైబర్ భద్రత నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. 2020 ఎన్నికల తర్వాత అమెరికా నిఘా సంస్థలు రూపొందించిన నివేదికలో చైనా కొన్ని రాష్ట్రాల ఓటరు సమాచారాన్ని సేకరించినట్లు పేర్కొన్నప్పటికీ, ఎన్నికల ఫలితాలను మార్చేందుకు ప్రయత్నించిందనే ఆధారాలు లేవని తేల్చినట్లు గుర్తు చేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో ఓటరు నమోదు వివరాలు ప్రజలకు అం



దుబాటులో ఉండటంతో వాటిని సేకరించడం కొత్త విషయం కాదని విశ్లేషకులు చెబుతున్నారు.

**ఖండించిన చైనా, పొలిటికల్ సెగ**

ట్రంప్ ఆరోపణలను చైనా పూర్తిగా తిరస్కరించింది. అమెరికా ఎన్నికల్లో తాము ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, భవిష్యత్తులో కూడా అలాంటి ఉద్దేశం లేదని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. అమెరికా ఎన్నికలు అక్కడి ప్రజల అంతర్గత అంశమని పేర్కొంది. ట్రంప్ ప్రసంగం అమెరికా రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. డెమోక్రటిక్ పార్టీ నేతలు ఈ ఆరోపణలకు బలమైన ఆధారాలు లేవని విమర్శిస్తున్నారు. స్వతంత్ర ఫ్యాక్ట్‌చెక్ సంస్థలు కూడా ట్రంప్ వివరించిన డేటా లీక్ ఎలా జరిగిందనే అంశంపై స్పష్టమైన సమాచారం లేదని చెబుతున్నాయి. మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల భద్రతను ప్రధాన రాజకీయ అంశంగా మార్చేందుకు ఈ వ్యాఖ్యలు ఉపయోగపడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విడుదలైన పత్రాలు ట్రంప్ ఆరోపణలకు పూర్తి మద్దతు ఇస్తాయా లేదా అన్నది పరిశీలన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం?

- ట్రంప్ ఆరోపణలతో కొత్త దుమారం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి 2020 అధ్యక్ష ఎన్నికల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. చైనా అమెరికా ఎన్నికల డేటాలో జోక్యం చేసుకుందని, 22 కోట్ల మంది అమెరికా ఓటర్ల వివరాలు చైనా చేతికి చేరాయని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, దీనికి సంబంధించిన కీలక నిఘా సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానం నమ్మకాన్ని కోల్పోయిందని కూడా విమర్శించారు.

**ఎన్నికల భద్రతపై హెచ్చరిక**

వైట్‌హౌస్ నుంచి ప్రసంగించిన ట్రంప్, అమెరికా ఎన్నికల వ్యవస్థ హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదంలో ఉందని చెప్పారు. ప్రతి ఓటు కచ్చితంగా లెక్కించబడే విధంగా ఎన్నికల వ్యవస్థను పూర్తిగా బలోపేతం చేయాలని కోరారు. అమెరికా ప్రజలు పారదర్శక ఎన్నికలను ఆశిస్తున్నారని, అందుకు చట్టాల్లో కీలక మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల భద్రతకు సంబంధించిన కీలక పత్రాలను వెంటనే విడుదల చేస్తామని వెల్లడించారు. చైనా అమెరికా ఓటర్ల సమాచారాన్ని సేకరించిందనే ఆరోపణ కొత్తది కాదు. 2020లో రూపొందించిన అమెరికా నిఘా నివేదికలో చైనా పలు రాష్ట్రాల ఓటరు నమోదు వివరాలను విశ్లేషించినట్లు ప్రస్తావన ఉంది. అయితే ఎన్నికల ఫలితాలను మార్చేందుకు చైనా ప్రయత్నించిందని నిర్ధారించే ఆధారాలు లేవని ఆ నివేదిక పేర్కొంది. 2020 ఎన్నికల తర్వాత ట్రంప్ తరఫున దాఖలైన 60కు పైగా కేసుల్లో కూడా ఎన్నికల ఫలితాన్ని మార్చే స్థాయి మోసం జరిగిందని ఏ న్యాయస్థానం తేల్చలేదు. రీకౌంట్లు, ఆడిట్లు కూడా అలాంటి ఆధారాలను గుర్తించలేదు.

**కొత్త చట్టానికి ట్రంప్ మద్దతు**

ప్రసంగం చివర్లో ట్రంప్ "సేవ్ యాక్ట్" ఆమోదించాలని కాంగ్రెస్‌ను కోరారు. ఓటరు నమోదు సమయంలో అమెరికా పౌరసత్వాన్ని నిరూపించే అధికారిక పత్రాలు తప్పనిసరి చేయాలన్నదే ఈ బిల్లులో ప్రధాన అంశం. అయితే ఈ నిబంధన వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పౌరహక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా చట్టాల ప్రకారం విదేశీయుల ఓటింగ్ ఇప్పటికే నిషేధితమే. ట్రంప్ ఆరోపణలను చైనా పూర్తిగా తిరస్కరించింది. అమెరికా ఎన్నికలు పూర్తిగా ఆ దేశ అంతర్గత వ్యవహారమని, చైనా ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, భవిష్యత్తులో కూడా అలాంటి చర్యలకు పాల్పడబోదని అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ట్రంప్ ప్రసంగం అమెరికా రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది. విడుదల చేయనున్న నిఘా పత్రాలు ఆయన ఆరోపణలకు ఎంత మేర మద్దతు ఇస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# డీలిమిటేషన్‌పై సస్పెన్స్



- కేంద్రానికి పెరిగిన ఉత్కంఠ
- వేచి చూసే ధోరణిలో డీఎంకే

డీలిమిటేషన్ బిల్లుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇప్పటికీ తన తుది వైఖరిని వెల్లడించలేదు. వచ్చే వారం ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు డీఎంకే ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో "వేచి చూద్దాం" అనే ధోరణితో ముందుకు వెళ్లాలని సూచించినట్లు సమాచారం. బిల్లు పూర్తి రూపం బయటకు వచ్చిన తర్వాతే పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**తమిళనాడు ప్రయోజనాలకే ప్రాధాన్యం**

పార్టీ సిద్ధాంతాలు, తమిళనాడు ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్టాలిన్ ఎంపీలకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. బీజేపీకి గానీ, కాంగ్రెస్‌కు గానీ ముందుగానే మద్దతు ప్రకటించే ఉద్దేశం లేదని, ప్రతి అంశాన్ని విడిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పార్టీ నాయకత్వం తెలిపినట్లు సమాచారం. దీంతో అధికార పక్షం, ప్రతిపక్ష కూటమి రెండూ డీఎంకే నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

**22 మంది ఎంపీలపై అందరి దృష్టి**

లోక్‌సభలో డీఎంకేకు 22 మంది ఎంపీలు ఉన్నారు. డీలిమిటేషన్ బిల్లును కేంద్రం మరోసారి ప్రవేశపెడితే వారి పాత్ర కీలకంగా మారే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో బిల్లు వచ్చినప్పుడు డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. బిల్లు ప్రతులను దహనం చేయడం, నల్ల దుస్తులతో పార్లమెంట్‌కు హాజరుకావడం, ప్రతిపక్షంతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేయడం వంటి చర్యలతో నిరసన తెలిపింది. చివరకు ఆ బిల్లు ఆమోదం పొందలేదు.

**మారిన రాజకీయ సమీకరణాలు**

ఏప్రిల్ తర్వాత తమిళనాడు రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలైంది. కాంగ్రెస్‌తో ఉన్న రాజకీయ అనుబంధం కూడా బలహీనపడింది. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుల పక్కన కూర్చోకుండా కొత్త సీటింగ్ ఏర్పాటు చేయాలని డీఎంకే స్పీకర్‌ను కోరింది. గత నెల జరిగిన ఇండియా కూటమి సమావేశానికి కూడా పార్టీ దూరంగా ఉండటం రాజకీయ చర్చకు దారి తీసింది.

**కేంద్రం ఆశలు... ప్రతిపక్ష లెక్కలు**

డీలిమిటేషన్ బిల్లులో అన్ని రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాలను సమానంగా 50 శాతం పెంచే హామీని చేర్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాంటి నిబంధన బిల్లులో ఉంటే తమ వైఖరిని పునఃపరిశీలిస్తామని కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే సంకేతాలు ఇచ్చాయి. డీఎంకే కూడా అధికారిక బిల్లు విడుదలైన తర్వాతే నిర్ణయం ప్రకటించనుంది. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుపై జరిగే చర్చ దేశ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికర అంశంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# మహారాష్ట్ర రాజకీయాల్లో కలకలం

- ఎన్సీపీలో విలీనమా? మరో చీలికా?

మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ భవిష్యత్తుపై కొత్త చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎన్సీపీ కీలక నేతలు వరుసగా సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. తొలుత ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే ముఖ్యమంత్రిని కలిశారు. మరుసటి రోజు అజిత్ పవార్ కుమారుడు, పార్టీ ఎంపీ పార్థ్ పవార్ కూడా ఫడ్నవీస్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశాలపై ఇరు వర్గాలు అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.

**పార్టీలో అంతర్గత విభేదాలు**

సునేత్ర పవార్ నాయకత్వంలోని ఎన్సీపీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఒకవైపు సునేత్ర పవార్, పార్థ్ పవార్ వర్గం ఉండగా మరోవైపు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే వర్గం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలో పార్థ్ పవార్ ప్రాధాన్యం పెరగడం, నిర్ణయాల్లో ఆయన పాత్ర ఎక్కువ కావడం పట్ల సీనియర్ నేతలు అసంతృప్తిగా ఉన్నారని సమాచారం.

**నాయకత్వంపై అసంతృప్తి**

అజిత్ పవార్ మరణం తర్వాత సునేత్ర పవార్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె ఉప ముఖ్యమంత్రిగా కూడా నియమితులయ్యారు. అప్పటి నుంచి ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కారే వంటి నేతలు పార్టీ వ్యవహారాల్లో పక్కకు నెట్టివేయబడ్డారనే అభిప్రాయం వినిపిస్తోంది. పార్టీ జాతీయ కార్యదర్శి సచ్చిదానంద్ సింగ్ కూడా సునేత్ర పవార్ ఎన్నిక ప్రక్రియపై బహిరంగంగా అభ్యంతరం వ్యక్తం



చేయడం ఈ విభేదాలను బహిర్గతం చేసింది.

**విలీనంపై ఊహాగానాలు**

అదే సమయంలో శరద్ పవార్ వర్గానికి చెందిన జయంత్ పాటిల్ కూడా ఫడ్నవీస్‌ను కలవడం రాజకీయ చర్చకు దారితీసింది. ప్రత్యర్థి వర్గాలకు చెందిన ముగ్గురు కీలక నేతలు ఒకే సమయంలో ముఖ్యమంత్రిని కలవడం యాదృచ్ఛికం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో రెండు ఎన్సీపీ వర్గాలు విలీనం అవుతాయా? లేక మరో రాజకీయ సమీకరణం రూపుదిద్దుకుంటుందా? అనే ఊహాగానాలు బలపడుతున్నాయి.

**ప్రకటన కోసం ఎదురుచూపు**

విలీన చర్చలను సునీల్ తట్కారే ఖండించారు. అజిత్ పవార్ జీవించి ఉన్న సమయంలో అలాంటి చర్చలు జరిగినా ప్రస్తుతం అలాంటి ప్రక్రియ లేదని చెప్పారు. మరోవైపు ప్రఫుల్ పటేల్, తట్కారే వర్గం ఎన్డీఏతో చర్చలు జరుపుతోందనే ప్రచారం కూడా కొనసాగుతోంది. శరద్ పవార్ వర్గం మాత్రం ఇండియా కూటమితోనే కొనసాగుతామని స్పష్టం చేసింది. వరుస భేటీలు, మౌనం, రాజకీయ సంకేతాల మధ్య మహారాష్ట్ర రాజకీయాలు మరోసారి ఉత్కంఠ రేపుతున్నాయి.

# పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం పూజలు

**అమ్మవారి ఆశీస్సులకై ప్రార్థనలు**



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో పూజారి సిస్ట శివ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు చేసి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న పవన్ కళ్యాణ్ పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని జనసేన నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు దొడ్డి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు సాగి వెంకటరమణ, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలపై ఎమ్మెల్యే వేగుళ్ల సమీక్ష



మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టిడ్కో గృహాలపై మున్సిపల్, టిడ్కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గృహాల్లో వాటర్ లీకేజీలు, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, ఇతర మరమ్మతుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి కాని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న గృహాల్లో లబ్ధిదారులు నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత లేని లబ్ధిదారులు చెల్లించిన రూ.1 లక్ష, రూ.50 వేల డిపాజిట్లను తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

# కొల్లేరు అక్రమ చెరువులు

- సుప్రీంకోర్టు కమిటీ సీరియస్
- అక్రమ చేపల చెరువులు తొలగించండి
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వండి

కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యంలో ఉన్న అక్రమ చేపల చెరువుల తొలగింపులో ఇక ఆలస్యం ఉండకూడదని సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ ఆక్వాకల్చర్ చెరువులను తొలగించే చర్యల్లో అటవీ శాఖకు ఏలూరు జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో సహకరించాలని స్పష్టం చేసింది. తొలగింపు కార్యక్రమం సమర్థంగా అమలు అయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించింది.

అక్రమ చెరువుల తొలగింపు సమయంలో స్థానిక అధికారుల నుంచి తగిన సహకారం లభించడం లేదని అటవీ శాఖ కమిటీ దృష్టికి తీసుకెళ్లింది. కొన్ని చోట్ల అధికారులు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. ఈ ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన సీఈసీ వెంటనే సహకారం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. కొల్లేరు సరస్సులో కొత్త ఆక్రమణలు, అక్రమ కట్టల నిర్మాణాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. అభయారణ్యంలో నడుస్తున్న అక్రమ చేపల చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. అతపాక పక్షుల కేంద్రానికి నీటి సరఫరా దెబ్బతినడం వల్ల వలస



పక్షులు, స్థానిక పక్షుల ఆవాసం ప్రమాదంలో పడుతోందని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది.

# అనపర్తి పగ్గాలు మనోజ్‌కు..

- టీడీపీలో సంబరాల జోష్

తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నల్లమిల్లి మనోజ్ రెడ్డిని నియమించింది. ఈ నిర్ణయంతో పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయాయి. రామవరంలో కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు మనోజ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన విషయం



తెలిసిందే. తాజా నియామకం అనపర్తిలో టీడీపీని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

# అక్రమ మట్టి తవ్వకాలు

» ప్రత్తిపాడు హైస్కూల్ వెనుక లూటీ
» దోపిడీ జరుగుతున్న పట్టని అధికారులు

**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ వెనుక భాగంలో భారీ ఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలు, డంపర్ల సహాయంతో మట్టిని తరలిస్తున్నారని చెబుతున్నారు. ఈ తవ్వకాల వల్ల ప్రభుత్వ భూములు దెబ్బతింటున్నాయని, ప్రాంత స్వరూపం పూర్తిగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**


**• విద్యార్థులకు ఇబ్బందులు**

భారీ వాహనాల రాకపోకలతో హైస్కూల్ పరిసరాల్లో దుమ్ము, ధూళి పెరిగిపోయిందని స్థానికులు అంటున్నారు. దీంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. లోతైన గుంతలు ఏర్పడటంతో వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. పర్యావరణానికి నష్టం కలగడంతో పాటు ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని అభిప్రాయపడుతున్నారు.

**• అధికారుల మౌనంపై ప్రశ్నలు**

ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై వెంటనే విచారణ చేపట్టి, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా మట్టి తరలింపునకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని కోరుతున్నారు. జిల్లా అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వాస్తవాలను వెలికితీసి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.






# అభివృద్ధికి బ్యాంకుల భాగస్వామ్యం

◆ రుణాలతో కొత్త కొత్త అవకాశాలు
◆ నరసరావుపేటలో భారీ రుణ మేళా
◆ బ్యాంకులకు చంద్రబాబు పిలుపు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు కీలక భాగస్వాములుగా ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించే విధానం అభినందనీయమని చెప్పారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకు రుణాలు ప్రధాన ఆధారమని వివరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణ మేళాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. (వివరాలు 7లో..)

## అందరికీ అందుబాటులో అర్హులందరికీ బ్యాంకు రుణాలు

• రుణాల పంపిణీలో కొత్త సంస్కృతి • ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
• నరసరావుపేటలో మెగా రుణ మేళా

అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకు రుణాలు అందేలా దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.3,216 కోట్ల విలువైన రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా లక్ష మందికిపైగా నేరుగా ప్రయోజనం పొందగా, వారి కుటుంబాలతో కలిపి దాదాపు ఐదు లక్షల మందికి మేలు జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. (వివరాలు 7లో..)

# మోదీ మౌనం వీడండి

• రామాలయ విరాళాల వివాదం • పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలి
• వివరణ ఇవ్వాల్సిందేనన్న కాంగ్రెస్


వివరాలు5లో..

అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వర్షాకాల సమావేశాలకు ముందు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. రామాలయ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో స్వయంగా ప్రధాని ప్రకటించారని గుర్తు చేశారు. అదే ట్రస్ట్‌పై ఇప్పుడు ఆరోపణలు రావడంతో పార్లమెంట్‌కు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.

**• ట్రస్ట్‌పై తీవ్ర ఆరోపణలు**

ట్రస్ట్ కార్యకలాపాల వల్ల కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి దెబ్బ తగిలిందని జైరాం రమేష్ ఆరోపించారు. విరాళాల సేకరణలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. "చందా చోరీ.. ఆస్థా ధోకా" అంటూ ట్రస్ట్ పనితీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఏర్పాటు నుంచి దాని విధులు వరకు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రకారమే జరిగాయని పేర్కొంటూ ఈ వ్యవహారంపై ప్రధాని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.




## జంతర్ మంతర్ నిఘా

**నిరసనకారుల పిటిషన్**

**ఢిల్లీ హైకోర్టులో వ్యాజ్యం**

జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలపై ఢిల్లీ పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జూలై 20న విచారణ చేపట్టనున్నట్లు కోర్టు తెలిపింది. మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తాను కూడా శాంతియుత ధర్నా, నిరాహార దీక్షలో పాల్గొంటున్నానని ఆమె పేర్కొన్నారు. (వివరాలు 5లో..)



## నాలుగేళ్ల చిన్నారి మృతికి న్యాయం

**₹ 40 లక్షల పరిహారం మంజూరు**

**ఢిల్లీ ట్రిబ్యునల్ కీలక తీర్పు**

2020లో ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి కుటుంబానికి ఢిల్లీ మోటార్ ప్రమాద పరిహార ట్రిబ్యునల్ రూ.40.37 లక్షల పరిహారం మంజూరు చేసింది. చిన్నారి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రమాదానికి కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్పష్టం చేసింది. బీమా లేని వాహనం కావడంతో డ్రైవర్, యజమాని కలిసి ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది. (వివరాలు 5లో..)

# మంగళగిరికి కొత్త ఊపు

▪ అభివృద్ధికి రైల్వే బాట
▪ పాల్గొన్న నారా లోకేశ్, పెమ్మసాని
▪ వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ

'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద రూ.12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**• రైల్వేలతో ఆర్థికాభివృద్ధి**

దేశ అభివృద్ధిలో రైల్వేలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని నారా లోకేష్ అన్నారు. ఆధునిక రైల్వే స్టేషన్లు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. మంగళగిరిని పరిశ్రమలకు అనువైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.



# పార్లమెంట్ వ్యూహంపై భేటీ

**ఎంపీలకు సీఎం మార్గదర్శనం • వర్షాకాల సమావేశాలకు వ్యూహరచన**





ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. సీఎం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, మంత్రి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అంశాలపై ఎంపీలకు ముఖ్యమంత్రి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

**• రాష్ట్ర ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి**

పోలవరం ప్రాజెక్టు పురోగతి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల పునరావాసం, అమరావతి రాజధాని నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. రాయలసీమకు సాగునీరు అందించే గోదావరి-పెన్నా అనుసంధాన ప్రాజెక్టుపై కూడా కేంద్ర దృష్టి సారించేలా కృషి చేయాలని ఎంపీలకు చెప్పారు.

**• రైల్వే జోన్ నుంచి మహిళా బిల్లు వరకు**

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, రైల్వే భూముల కేటాయింపు, పూర్తిస్థాయి కార్యకలాపాల ప్రారంభంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే కొత్త బిల్లులు, చట్ట సవరణలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు, ఎస్ఐఆర్ అంశాలపై పార్టీ వైఖరిని ఖరారు చేశారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, దుష్ప్రచారం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరుగుతున్న దాడుల అంశాలను కూడా పార్లమెంట్ వేదికగా ప్రస్తావించాలని ముఖ్యమంత్రి సూచించారు. చివరగా ఎంపీలు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను వివరించి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై అభిప్రాయాలు వెల్లడించారు.


7లో..

## విశ్వవిద్యాలయాల్లో పారదర్శక నియామకాలు

**ప్రక్రియ పారదర్శకంగా జరపాలన్న లోకేశ్**

ఉండవల్లిలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగాలని ఆదేశించారు. వైస్ ఛాన్స్‌లర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. నియామకాలలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా, ఆరోపణలు వచ్చినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


## హామీల అమలు ఎప్పుడు?

**ప్రజలను మోసం చేస్తున్న కూటమి • ప్రభుత్వంపై బొత్స తీవ్ర విమర్శలు**

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం ప్రకటించిన హామీలకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులకు సంబంధం కనిపించడం లేదని విమర్శించారు. కేటాయించిన నిధుల్లో ఎంత విడుదల చేశారో కూడా స్పష్టత లేదని ప్రశ్నించారు. (వివరాలు 5లో..)



# ఏనుగు ఆపరేషన్ విజయవంతం


7లో..

**పలమనేరు ప్రజలకు ఊరట**

పలమనేరు పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తూ గ్రామస్థులను భయాందోళనకు గురిచేస్తున్న ఒంటరి మగ అడవి ఏనుగును ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ విజయవంతంగా బంధించింది. సుమారు 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ ఏనుగును పట్టుకోవడానికి నెలరోజుల పాటు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలను పాటిస్తూ పశువైద్య నిపుణులు, అటవీ అధికారులు పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు.



## స్విమ్స్ నియామకాలపై ఆరోపణలు

**303 పోస్టుల భర్తీపై తీవ్ర విమర్శలు • సమగ్ర విచారణకు భూమన డిమాండ్**

టీటీడీ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ... స్విమ్స్ చేపట్టిన 303 ఉద్యోగాల నియామక ప్రక్రియ డీఎస్సీ తరహా కుంభకోణాన్ని తలపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన నియామకాల ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని విమర్శించారు. నిబంధనలను పక్కనపెట్టి కొందరికి ప్రయోజనం కలిగించేలా అర్హతలు, సిలబస్, వేతనాల్లో మార్పులు చేశారని ఆరోపించారు. (వివరాలు 7లో..)




## ఓటరు జాబితా తొలగింపు సంక్షేమ పథకాలు ఆపొచ్చా?

**సుప్రీంకోర్టులో కీలక విచారణ**

ఓటరు జాబితా నుంచి పేరు తొలగించిన కారణంగా సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేయవచ్చా అనే కీలక అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఆధారంగా ఆహార భద్రత, మహిళల సంక్షేమం, వెనుకబడిన వర్గాల ధ్రువపత్రాలకు సంబంధించిన ప్రయోజనాలను నిలిపివేస్తున్నారని కాంగ్రెస్ నేత ప్రసేంజిత్ బోస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసులు జారీ చేసింది. (వివరాలు 5లో..)

# ఆవేశం.. అనుమానం.. ప్రాణాలు బలి

**మానవత్వాన్ని మింగేస్తున్న నేరాలు**

ప్రేమ పేరుతో ప్రాణాలు తీసుకోవడం, ప్రేమ విఫలమై హత్యలు జరగడం, క్షణికావేశంలో కుటుంబ సభ్యులే ఒకరినొకరు చంపుకోవడం వంటి ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. సహనం, మానవీయ విలువలు తగ్గిపోతుండగా చిన్నచిన్న విభేదాలే ప్రాణాంతకంగా మారుతున్నాయి. యువతలో భావోద్వేగాలను నియంత్రించలేక తీసుకుంటున్న ఆవేశపూరిత నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ప్రేమ, కోపం, అనుమానం, అహంకారం వంటి భావోద్వేగాలు నేరాలకు కారణమవుతున్నాయి. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న మూడు వేర్వేరు ఘటనలు సమాజంలో పెరుగుతున్న హింసాత్మక ధోరణికి అద్దం పడుతున్నాయి. ఇవి ప్రతి కుటుంబం, ప్రతి యువకుడు ఆలోచించాల్సిన హెచ్చరికగా నిలుస్తున్నాయి.


5లో..

## స్థానిక పోరుకు.. జనసేన వ్యూహం

▪ సార్వత్రిక ఎన్నికల ఫార్ములా వేరు
▪ క్షేత్రస్థాయి బలాబలాలే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసిన సీట్ల పంపకం విధానం స్థానిక సంస్థల ఎన్నికలకు యథాతథంగా వర్తించదని జనసేన ముఖ్య నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, క్షేత్రస్థాయి బలాబలాలు, ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల వ్యూహాన్ని రూపొందిస్తామని తెలిపారు. (వివరాలు 3లో..)





7లో..

## నీట్ రీ-టెస్ట్‌కు భారీగా డుమ్మా

• 2.79 లక్షల మంది గైర్హాజరు




## ప్రధాని, సీఎంల తొలగింపు బిల్లుకు బ్రేక్

**బిల్లుపై కమిటీ వెనక్కి....**

**మరింత చర్చకు నిర్ణయం**

ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు తీవ్రమైన కేసుల్లో వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే పదవుల నుంచి తొలగించేలా ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీ తన ముసాయిదా నివేదికను ఆమోదించకుండా వాయిదా వేసింది. సభ్యుల అభిప్రాయాలను మరింతగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిటీ నిర్ణయించింది. (వివరాలు 5లో..)




# ఓటరు జాబితా తొలగింపు

- **సంక్షేమ పథకాలు ఆపొచ్చా?**
- **సుప్రీంకోర్టులో కీలక విచారణ**

ఓటరు జాబితా నుంచి పేరు తొలగించిన కారణంగా సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేయవచ్చా అనే కీలక అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఆధారంగా ఆహార భద్రత, మహిళల సంక్షేమం, వెనుకబడిన వర్గాల ధ్రువపత్రాలకు సంబంధించిన ప్రయోజనాలను నిలిపివేస్తున్నారని కాంగ్రెస్ నేత ప్రసేంజిత్ బోస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసులు జారీ చేసింది.

### ఎస్ఐఆర్ ఎన్నికలకే పరిమితం

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికలకు మాత్రమే సంబంధించినదని స్పష్టం చేసింది. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకున్నట్లుగా భావించరాదని న్యాయస్థానం పేర్కొంది. పౌరసత్వ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి లేదని కూడా ధర్మాసనం గుర్తుచేసింది.

### 34 లక్షల అప్పీలు పెండింగ్

పిటిషన్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 34 లక్షల అప్పీలు దాఖలయ్యాయి. ఇప్పటివరకు కేవలం 38 వేల అప్పీలకే పరిష్కారం లభించింది. విచారణ పూర్తైన వాటిలో సుమారు 70 శాతం కేసుల్లో ఓటర్ల పేర్లను మళ్లీ జాబితాలో చేర్చాలని నిర్ణయించారు. ఇంకా లక్షలాది అప్పీలు పెండింగ్‌లో ఉండటంతో అనేక మంది పౌరులు సంక్షేమ పథకాల లబ్ధి కోల్పోతున్నారని పిటిషనర్ వాదించారు.

### పారదర్శక విధానం కావాలి

అప్పీళ్ల విచారణకు స్పష్టమైన మార్గదర్శకాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. అవసరమైన పత్రాలు ఏమిటి, విచారణ ఎలా జరుగుతుంది, నిర్ణయాలు ఎప్పుడు వెల్లడిస్తారు అనే అంశాలపై ప్రజలకు సమాచారం అందుబాటులో లేదని ఆరోపించారు. ప్రతి ట్రిబ్యునల్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి తీర్పులు, విధివిధానాలు బహిరంగంగా ఉంచాలని కోర్టును కోరారు. స్థానిక భాషల్లో మార్గదర్శకాలు అందుబాటులోకి తేవాలని కూడా విజ్ఞప్తి చేశారు.

### పేదల హక్కులపై ప్రభావం

ఓటరు జాబితా నుంచి పేరు తొలగించడం వల్ల అత్యధికంగా పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరక్షరాస్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టపరమైన సహాయం లేకపోవడం వల్ల చాలామంది అప్పీలు కూడా దాఖలు చేయలేకపోతున్నారని వాదించారు. ఈ అంశం రాజ్యాంగపరమైన హక్కులకు సంబంధించినదని భావించిన సుప్రీంకోర్టు కేసును అత్యవసరంగా విచారించేందుకు అంగీకరించింది. ఈ విచారణలో వెలువడే తీర్పు ఓటరు జాబితా, సంక్షేమ పథకాల అనుసంధానంపై దేశవ్యాప్తంగా కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

# మోదీ మౌనం వీడండి

- **రామాలయ విరాళాల వివాదం**
- **పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలి**
- **వివరణ ఇవ్వాల్సిందేనన్న కాంగ్రెస్**

అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వర్షాకాల సమావేశాలకు ముందు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. రామాలయ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో స్వయంగా ప్రధాని ప్రకటించారని గుర్తు చేశారు. అదే ట్రస్ట్‌పై ఇప్పుడు ఆరోపణలు రావడంతో పార్లమెంట్‌కు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.

### ట్రస్ట్‌పై తీవ్ర ఆరోపణలు

ట్రస్ట్ కార్యకలాపాల వల్ల కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి దెబ్బ తగిలిందని జైరాం రమేష్ ఆరోపించారు. విరాళాల సేకరణలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. "చందా చోరీ.. ఆస్థా ధోకా" అంటూ ట్రస్ట్ పనితీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రస్ట్



ఏర్పాటు నుంచి దాని విధులు వరకు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రకారమే జరిగాయని పేర్కొంటూ ఈ వ్యవహారంపై ప్రధాని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### దర్యాప్తు కొనసాగుతున్న కేసు

గత నెల వెలుగులోకి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు కీలక బాధ్యులు రాజీనామా చేశారు. హుండీ విరాళాల నుంచి మళ్లించబడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నగదులో కొంత మొత్తాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది.

### సుప్రీంకోర్టు పర్యవేక్షణ

ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో కూడా ఉంది. దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఈ నెల 20న మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించే అవకాశం ఉందని సమాచారం. కేసులో నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కూడా విచారణ కొనసాగుతోంది.

### మౌనం వీడతారా?

ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పటికే తుది దర్యాప్తు నివేదిక వచ్చిన తర్వాతే స్పందిస్తానని ప్రకటించారు. ప్రస్తుతం ఈ అంశం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తనున్నట్లు సంకేతాలు ఇచ్చింది. మరోవైపు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆరోపణలపై తుది నిజాలు అధికారిక విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. దీంతో పార్లమెంట్‌లో ఈ వ్యవహారంపై జరిగే చర్చపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# హామీల అమలు ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి..)
ఈ ఏడాది కూడా 'తల్లికి వందనం' పథకంలో కోత విధించారని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే పథకానికి సంబంధించిన నిధులు పూర్తిగా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దుకోవాలని మాత్రమే తాము కోరుతున్నామని చెప్పారు. తాము చేస్తున్న విమర్శలు రాజకీయాల కోసం కాదని, విద్యార్థుల తల్లులు వ్యక్తం చేస్తున్న ఆవేదననే బయటపెడుతున్నామని పేర్కొన్నారు.

### విద్యారంగం దెబ్బతిందన్న ఆరోపణ

కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యా వ్యవస్థను బలహీన పరిచిందని బొత్స ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదలపై పూర్తి వివరాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలపై ప్రజలు సమాధానం కోరుతున్నారని బొత్స అన్నారు.

# స్థానిక పోరుకు.. జనసేన వ్యూహం

- **సార్వత్రిక ఎన్నికల ఫార్ములా వేరు**
- **క్షేత్రస్థాయి బలాబలాలే కీలకం**

సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేసిన సీట్ల పంపకం విధానం స్థానిక సంస్థల ఎన్నికలకు యథాతథంగా వర్తించదని జనసేన ముఖ్య నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, క్షేత్రస్థాయి బలాబలాలు, ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల వ్యూహాన్ని రూపొందిస్తామని తెలిపారు. ప్రతి ప్రాంతంలో పార్టీ బలాన్ని సమగ్రంగా అంచనా వేసిన తర్వాతే పోటీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

### కార్యకర్తల భావాలకు ప్రాధాన్యం

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని జనసేన నాలుగు అడుగులు వెనక్కి తగ్గిందని నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. ఆ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు బాధ్యతగా అమలు చేశాయని చెప్పారు. కార్యకర్తల ఆవేదన, ఆశలు, ఆకాంక్షలు తమకు పూర్తిగా తెలుసని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్డీఏ విజయమే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఎన్డీఏ విజయమే ప్రధాన ధ్యేయమని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై కూటమి భాగస్వామ్య పార్టీలు కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే అభ్యర్థులను బరిలోకి దింపి స్థానిక సంస్థల్లో కూడా ఎన్డీఏ విజయపతాకం ఎగురవేయడానికి సమాయత్తమవుతున్నామని స్పష్టం చేశారు.

# జంతర్ మంతర్ నిఘా

- **నిరసనకారుల పిటిషన్**
- **ఢిల్లీ హైకోర్టులో వ్యాజ్యం**

జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలపై ఢిల్లీ పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జూలై 20న విచారణ చేపట్టనున్నట్లు కోర్టు తెలిపింది. మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తాను కూడా శాంతియుత ధర్నా, నిరాహార దీక్షల్లో పాల్గొంటున్నానని ఆమె పేర్కొన్నారు.




### నిరంతర నిఘాపై ఆరోపణలు

పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం నిరసన ప్రాంగణంలో పోలీసులు నిరసనకారుల ఫొటోలు, వీడియోలు నిరంతరం చిత్రీకరిస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన శాశ్వత నిఘా టవర్ ద్వారా పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతి కదలికను రికార్డు చేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలు నిరసన తెలిపే పౌరులపై ఒత్తిడి తీసుకొచ్చే సాధనంగా మారాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### విద్యార్థులకు బెదిరింపుల ఆరోపణ

నిరసనల్లో పాల్గొనే విద్యార్థుల ఫొటోలు, వీడియోలను వారి తల్లిదండ్రులకు, విద్యాసంస్థల యాజమాన్యాలకు పంపిస్తామని పోలీసులు బెదిరించారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ హెచ్చరికల కారణంగా అనేక మంది విద్యార్థులు నిరసనలకు రావడానికి వెనుకాడుతున్నారని పేర్కొన్నారు. తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడిందని పిటిషనర్ వాదించారు.

### రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన?

ఈ నిఘా చర్యలు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత నిరసన హక్కులను దెబ్బ తీస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిరసనల్లో పాల్గొనే వారిపై నిరంతర నిఘా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వాదించారు. ఫొటోలు, వీడియోలు ఏ చట్టం ప్రకారం సేకరిస్తున్నారు, ఎంతకాలం భద్రపరుస్తున్నారు, ఎలా వినియోగిస్తున్నారు అనే వివరాలు వెల్లడించాలని పలుమార్లు కోరినా సమాధానం రాలేదని ఆరోపించారు.

### కోర్టు తీర్పుపై ఆసక్తి

పోలీసుల నిఘా చట్టబద్ధతపై స్పష్టత కోరుతూ దాఖలైన ఈ పిటిషన్ ఇప్పుడు న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది. నిరసన ప్రదేశంలో ఫొటోగ్రఫీ, వీడియో చిత్రీకరణ, శాశ్వత నిఘా టవర్ నిర్వహణ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని పిటిషనర్ కోరుతున్నారు. ఈ అంశంపై జూలై 20న జరిగే విచారణలో ఢిల్లీ హైకోర్టు ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ కేసు ఫలితం దేశంలో నిరసనల సందర్భంగా అమలు చేసే నిఘా విధానాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.




# ప్రధాని, సీఎంల తొలగింపు బిల్లుకు బ్రేక్

- **బిల్లుపై కమిటీ వెనక్కి...**
- **మరింత చర్చకు నిర్ణయం**

ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు తీవ్రమైన కేసుల్లో వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే పదవుల నుంచి తొలగించేలా ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీ తన ముసాయిదా నివేదికను ఆమోదించకుండా వాయిదా వేసింది. సభ్యుల అభిప్రాయాలను మరింతగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిటీ నిర్ణయించింది.

### ఐదు కీలక సిఫారసులు, చర్చ అవసరమని అభిప్రాయం

కమిటీ అధ్యక్షురాలు అపరాజిత సారంగి వివరాల ప్రకారం ముసాయిదా నివేదికపై సభ్యుల మధ్య విస్తృత చర్చ జరిగింది. నివేదికలోని ప్రతి సిఫారసుపై విడివిడిగా ఓటింగ్ నిర్వహించే సమయంలో మరింత సంప్రదింపులు అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో నివేదికను వెంటనే ఆమోదించకుండా తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త కమిటీ ఇటీవల సభ్యులకు ముసాయిదా నివేదికను పంపించింది. ఇందులో మొత్తం ఐదు కీలక సిఫారసులు ఉన్నాయి. వాటిపై సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. బిల్లుకు సంబంధించిన కొన్ని నిబంధనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాలని కమిటీ భావించింది.

### విభేదాలు తాత్కాలికంగా సద్దుమణిగిన వేళ

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) ఎంపీ సుప్రియా సూలే మొదట తమ విభేదాలను నమోదు చేస్తూ ప్రత్యేక అభిప్రాయాలను సమర్పించారు. అయితే నివేదిక ఆమోదాన్ని వాయిదా వేయాలని కమిటీ నిర్ణయించిన తర్వాత వారు తమ విభేదాల నోట్లు ఉపసంహరించుకున్నారు. దీనివల్ల సభ్యుల మధ్య మరింత చర్చకు అవకాశం ఏర్పడింది. బిల్లుపై తుది నిర్ణయానికి ముందు సంబంధిత వర్గాల అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకోవాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. రాజ్యాంగానికి సంబంధించిన కీలక అంశం కావడంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదనే అభిప్రాయం వ్యక్తమైంది. అన్ని వర్గాల సూచనలను పరిశీలించిన తర్వాతే తుది నివేదికను సిద్ధం చేయనున్నట్లు కమిటీ సంకేతాలు ఇచ్చింది. ఈ పరిణామంతో 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై తుది నిర్ణయం మరికొంతకాలం వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది.


# పేపర్ లీక్ మాఫియాకు చెక్

- **పరీక్షల వ్యవస్థలో సమూల మార్పులు అవసరం**
- **రాజకీయ ఏకాభిప్రాయం కావాలన్న రాహుల్ గాంధీ**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలో పెరుగుతున్న పేపర్ లీక్ ఘటనలకు అడ్డుకట్ట వేయాలంటే అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు. డెహ్రాడూన్‌లో నిర్వహించిన "ఛాత్రోన్ కి గూంజ్" సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అమలులో ఉన్న పరీక్షల విధానం ప్రభుత్వ కేంద్రంగా ఉందని, దాన్ని విద్యార్థి కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు సురక్షిత ప్రశ్నల బ్యాంక్, యాదృచ్ఛికంగా వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జీఎంఏటీ, ఎస్ఏటీ వంటి అంతర్జాతీయ పరీక్షల్లో అమలవుతున్న సాంకేతిక విధానాలను భారత్‌లో కూడా తీసుకురావాలని చెప్పారు. పరీక్షల నిర్వహణ ప్రభుత్వ బాధ్యతేనని, ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరైన నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లీక్ జరిగిన వెంటనే మళ్లీ పరీక్ష నిర్వహించడంతో పాటు బాధిత విద్యార్థులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

పేపర్ లీక్ సమస్యను దేశ యువత ఎదుర్కొంటున్న




అత్యంత తీవ్రమైన అన్యాయాల్లో ఒకటిగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. పోటీ పరీక్షల కోసం కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, సంవత్సరాల తరబడి విద్యార్థులు కష్టపడుతున్నా ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. దాదాపు తొమ్మిది కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే కేవలం ఆరు లక్షల మందికే అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు. టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ వేదికల ద్వారా ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటివరకు 152కు పైగా పోటీ పరీక్షలు ప్రభావితమైనా దోషులకు సరైన శిక్షలు పడలేదని విమర్శించారు. పేపర్ లీక్ ఘటనలు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. నీట్ పరీక్ష లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు కూడా సభలో పాల్గొన్నారు. విద్యార్థుల కష్టాన్ని గౌరవించే పారదర్శక పరీక్షల వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# నాలుగేళ్ల చిన్నారి మృతికి న్యాయం

- **₹ 40 లక్షల పరిహారం మంజూరు**
- **ఢిల్లీ ట్రిబ్యునల్ కీలక తీర్పు**

2020లో ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి కుటుంబానికి ఢిల్లీ మోటార్ ప్రమాద పరిహార ట్రిబ్యునల్ రూ.40.37 లక్షల పరిహారం మంజూరు చేసింది. చిన్నారి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రమాదానికి కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్పష్టం చేసింది. బీమా లేని వాహనం కావడంతో డ్రైవర్, యజమాని కలిసి ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది.

### ప్రమాదం ఎలా జరిగింది?

2020 అక్టోబర్ 12న చిన్నారి తన తోబుట్టువులు, మరో వ్యక్తితో కలిసి రహదారి దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. జిగ్‌జాగ్ విధానంలో నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ట్రిబ్యునల్ పేర్కొంది. తీవ్రంగా గాయపడిన చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటన కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. చిన్నారి తండ్రి ప్రత్యక్ష సాక్షిగా ఇచ్చిన వాంగ్మూలం, దర్యాప్తులో నమోదు చేసిన సాక్ష్యాలు, పోలీసుల ఛార్జిషీట్ ఆధారంగా ట్రిబ్యునల్ తన నిర్ణయం తీసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. తమపై వచ్చిన ఆరోపణలను ఖండించే ఎలాంటి బలమైన సాక్ష్యాలను ప్రత్యర్థులు



సమర్పించలేదని కూడా ట్రిబ్యునల్ తన ఉత్తర్వులో వెల్లడించింది.

### 30 రోజుల్లో చెల్లించాలని ఆదేశం

పరిహారం నిర్ణయించే సమయంలో ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులను ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకుంది. కనీస వేతనాలను ఆధారంగా తీసుకుని భవిష్యత్తులో కుటుంబానికి కలిగే ఆర్థిక నష్టాన్ని అంచనా వేసింది. అంత్యక్రియల ఖర్చులు, కుటుంబానికి కలిగిన నష్టం, ఇతర సంప్రదాయ పరిహార అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంది. మొత్తం రూ.40.37 లక్షల పరిహారంతో పాటు పిటిషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఏడాదికి 9 శాతం వడ్డీ కూడా చెల్లించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా జమ చేయాలని డ్రైవర్, వాహన యజమానికి స్పష్టం చేసింది. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ఎంతటి విషాదాలకు కారణమవుతుందో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ప్రేమలో విషాదం

- **యువతి బలవన్మరణం**
- **ప్రియుడి ఇంటి ముందు నిరసన**

ఎనిమిదేళ్లుగా ప్రేమించిన యువకుడు మరో పెళ్లికి సిద్ధపడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అడ్డగళ్ల కీర్తి (24) ముంబైలో ఆత్మహత్య చేసుకుంది. ప్రకాశం జిల్లా పొందూరుకు చెందిన యువకుడు సాయితో వివాహం జరుగుతుందని ఆశించిన ఆమెకు నిరాశ ఎదురైంది. ఈ ఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు ప్రియుడు ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. కీర్తికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరు కుటుంబాలతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# కర్నాటకలో దారుణం

- **ప్రేమ పేరుతో హత్య**
- **బస్టాండ్‌లో యువతి హత్య**

కర్నాటకలో ప్రేమను నిరాకరించిందనే కారణంతో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. బంట్వాల్‌లోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో నిందితుడు చేతన్ బహిరంగంగా లావణ్యపై దాడి చేసి హత్య చేశాడు. లావణ్యకు బంధువైన చేతన్ కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తుండగా, ఆమె నిరాకరించడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు సమాచారం. ఘటన తర్వాత నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ప్రజల ఎదుట జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు హత్యకు గల పూర్తి కారణాలను విచారిస్తున్నారు.

# బద్రీనాథ్ హుండీ నిధుల మాయం

- **మాజీ ఆలయ అధికారిని అరెస్ట్**

ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ బద్రీనాథ్ ఆలయంలో హుండీ విరాళాల మాయంపై జరుగుతున్న దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆలయ మాజీ అధికారి రాజేంద్ర చౌహాన్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం, సిట్ అరెస్ట్ చేసింది. నాలుగు గంటల పాటు విచారణ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. తదుపరి దర్యాప్తు కోసం జూలై 18న ఆయనను కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

### సీసీటీవీ ఆధారాలతో అనుమానాలు

ఈ కేసులో రాజేంద్ర చౌహాన్ కీలక నిందితుల్లో ఒకరిగా ఎస్ఐటీ భావిస్తోంది. దర్యాప్తులో సేకరించిన సీసీటీవీ దృశ్యాల్లో జూన్ 22, జూన్ 25, జూన్ 29 తేదీల్లో నగదు కట్టలను తీసుకుని జేబులో పెట్టుకున్నట్లు కనిపించినందున ఆయనను విచారణకు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ఈ దృశ్యాలతో పాటు ఇతర ఆధారాలను కూడా పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ వీడియోలు కేసులో కీలక సాక్ష్యాలుగా మారాయి. బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ రూపొందించిన 18 పేజీల అంతర్గత విచారణ నివేదికను ఇప్పటికే ఎస్ఐటీకి అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా దర్యాప్తు మరింత వేగం అందుకుంది. జూన్ 29, జూలై 2 తేదీలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు. అంతకుముందే జూన్ 22, జూన్ 25 తేదీల దృశ్యాలను విశ్లేషించినట్లు తెలిపారు.

### ఆలయ నిర్వహణపై విచారణ

జూలై 14న ఆలయ హుండీ వ్యవస్థను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ బద్రీనాథ్ ధామ్‌ను సందర్శించింది. భక్తులు ఇచ్చే విరాళాల సేకరణ విధానం, నగదు తరలింపు ప్రక్రియ, లెక్కింపు కేంద్రంలో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించింది. హుండీ నిధుల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ సాగుతోంది. కేసులో ఆలయ ప్రధాన కార్యనిర్వా




హణ అధికారి సోహన్ సింగ్ రంగడ్, ఆయన వ్యక్తిగత సహాయకుడు అతుల్ దిమ్రీలను కూడా ఎస్ఐటీ ప్రశ్నించింది. ఆలయ సీసీటీవీ నియంత్రణ కేంద్రంలో అధికారులు నేరుగా పరిశీలన నిర్వహిస్తూ ప్రతిరోజు విరాళాల నిర్వహణ విధానాన్ని పరిశీలిస్తున్నారు. కొత్త ఆధారాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో మరికొందరు అనుమానితులను కూడా విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. హుండీ నిధుల మాయ కేసులో పూర్తి నిజాలు వెలికితీయడమే లక్ష్యంగా ఎస్ఐటీ దర్యాప్తును వేగవంతం చేసింది.

# అరవం అరువు అవసరమా..

## సినిమా క్యాస్టింగ్ వేస్ట్..

## పర్సనల్ క్యాస్ట్‌తోనే రిజల్ట్

సినిమా తెరపై హీరో ఎంట్రీకి థియేటర్ మొత్తం హోరెత్తిపోతుంది. విజిల్స్, చప్పట్లు, కాగితాల వర్షం... కొన్ని క్షణాలు చూస్తే ఆ హీరోకు ఎదురు లేదనిపిస్తుంది. కానీ అదే హీరో ఎన్నికల బరిలో అడుగుపెడితే సన్నివేశం పూర్తిగా మారిపోతుంది. అక్కడ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉండదు. అభిమానుల అరుపులు వినిపించవు. కట్ చెప్పే దర్శకుడు ఉండడు. అక్కడ ఒక్క బటన్ నొక్కే ఓటరే కథకు అసలు రచయిత. ఆ బటన్ నొక్కే ముందు అతను హీరో హిట్ సినిమాలు గుర్తు చేసుకోడు... తన జీవితాన్ని గుర్తు చేసుకుంటాడు. తన కుటుంబ భవిష్యత్తును బేరీజు వేస్తాడు. తన గ్రామానికి వచ్చిన అభివృద్ధిని తూకం వేస్తాడు. అందుకే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు సినిమా కథలా సాగవు. క్లైమాక్స్‌ను నిర్ణయించేది స్టార్ ఇమేజ్ కాదు... ప్రజల నమ్మకం. అందుకే తమిళనాడులో విజయ్ రాజకీయ రంగప్రవేశం చుట్టూ నెలకొన్న ఉత్సాహాన్ని చూసి, అదే కథను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఊహించుకోవడం రాజకీయ వాస్తవాలను సులభంగా తీసుకోవడమే అవుతుంది. ఈ నేల చరిత్ర చెబుతున్న పాఠం వేరు. ఎన్టీఆర్ విజయం కేవలం సినీ గ్లామర్ గెలుపు కాదు... తెలుగు ఆత్మగౌరవ ఉద్యమానికి ప్రజలు ఇచ్చిన తీర్పు. చిరంజీవి ప్రయోగం అభిమానాన్ని ఓట్లుగా మార్చడం ఎంత క్లిష్టమో చూపించింది. పవన్ కళ్యాణ్ ప్రయాణం మాత్రం గ్లామర్‌కు తోడు సహనం, వ్యూహం, కూటమి రాజకీయాలు కలిసొస్తేనే అధికార ద్వారాలు తెరుచుకుంటాయని నిరూపించింది. అందుకే ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ లేదా మరో సినీ హీరో కొత్త పార్టీ పెడతారనే చర్చ వినిపిస్తున్నా... అసలు ప్రశ్న ఒక్కటే. ఆ పార్టీ నిజంగా రాజకీయ సమీకరణాలను మార్చగలదా? లేక సభల్లో చప్పట్లు మాత్రమే మిగిల్చి, బ్యాలెట్ బాక్సు ముందు మరోసారి ఆంధ్ర ఓటరు తన ప్రత్యేక తీర్పునే రాస్తాడా? అదే ఈ రాజకీయ కథలో అత్యంత ఉత్కంఠభరితమైన క్లైమాక్స్.





**ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే ఒక ప్రాథమిక సత్యాన్ని ముందుగా అంగీకరించాల్సిందే. ఈ నేలపై ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది కేవలం స్టార్‌డమ్ మాత్రమే కాదు. తెరపై వెలిగిన కాంతి కంటే ప్రజల మనసుల్లో వెలిగిన నమ్మకమే ఇక్కడ ఓటును కదిలిస్తుంది. అభిమాన సంఘాలు సభలను నింపగలవు. కానీ పోలింగ్ బూత్‌ను గెలిపించేది రాజకీయ విశ్వసనీయత, సామాజిక సమీకరణాలు, పార్టీ కేడర్, నాయకుడి నడవడి, ప్రజలతో ఏర్పడిన భావోద్వేగ బంధం. అందుకే భారత రాజకీయ ముఖచిత్రంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్పెషల్ పొలిటికల్ స్వభావం ఉండనే ఉంది. అదే తమిళనాడులో సినిమా, రాజకీయాలు పరస్పర అనుబంధంగా ఎదిగాయి. అక్కడ సినిమా హీరో రాజకీయ నాయకుడిగా మారడం ఒక అసాధారణ పరిణామం కాదు. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి నుంచి నేటి విజయ్ వరకు సినీ ప్రజాదరణ రాజకీయ మూలధనంగా మారిన ఉదాహరణలు కనిపిస్తాయి. కానీ అదే సూత్రాన్ని యథాతథంగా ఆంధ్రప్రదేశ్‌కు వర్తింపజేయడం రాజకీయ వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో ఓటరు సినిమా అభిమానిగా ఎంత భావోద్వేగంతో ఉంటాడో, ఓటరుగా అంతకంటే ఎక్కువ ఆచితూచి నిర్ణయం తీసుకుంటాడు. ఇది మేం చెబుతున్న మాట కాదు గానీ చరిత్ర చెప్పే సత్యం.**

- **రొటీన్‌కు భిన్నం ఆంధ్ర రాజకీయం**
- **సినీ గ్లామర్ కంటే సెంటిమెంట్ ప్రభావాన్నే నమ్ముతున్న ఓటరు**
- **విజయ్ దళపతితో పోల్చుకోవడం అంటే..**
- **పులిని చూసి నక్క వాత పెట్టుకోవడమే..**
- **కొత్తగా సినిమా పార్టీ పుట్టుకొస్తే లాభమెవరికి..నష్టమెవరికి?**

### • సినిమా దాటి చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ నాయకత్వం

తెలుగు రాజకీయాల్లో సినీ గ్లామర్‌కు చిరస్థాయి రాజకీయ విజయాన్ని జోడించిన పేరు ఒక్కటే.. నందమూరి తారక రామారావు. అయితే ఆయన విజయాన్ని కేవలం సినీ అభిమానానికి కట్టిపెట్టడం చరిత్రను చిన్నబుచ్చడమే అవుతుంది. తెలుగు ఆత్మగౌరవాన్ని రాజకీయ నినాదంగా మలచడం, అప్పటి కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రజా ఉద్యమంగా మార్చడం, ప్రత్యామ్నాయ రాజకీయాలపై ప్రజల్లో ఉన్న ఆకాంక్షను సక్రమంగా అందిపుచ్చుకోవడం.. ఈ మూడు శక్తుల సంగమమే ఎన్టీఆర్ విజయానికి కారణం. ఆయన సినిమా నుంచి రాజకీయాల్లోకి రాలేదు.. ఒక ఉద్యమానికి నాయకత్వం వహించారు. అందుకే ఎన్టీఆర్ విజయాన్ని ఒక సినీ హీరో విజయం కంటే రాజకీయ చరిత్రలో మలుపు తిప్పిన ఘట్టంగా విశ్లేషకులు పేర్కొంటారు. ఎన్టీఆర్ తర్వాత కూడా తెలుగు సినీ పరిశ్రమ నుంచి అనేక మంది ప్రముఖులు రాజకీయాల్లోకి వచ్చారు. కైకాల సత్యనారాయణ, కోట శ్రీనివాసరావు, కృష్ణంరాజు, బాబూమోహన్, జయప్రద, జయసుధ, రోజా, మోహన్‌బాబు వంటి వారు ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా, ఎంపీలుగా సేవలందించారు. కానీ వారంతా ఇప్పటికే ప్రజల్లో బలమైన వేర్లు వేసుకున్న రాజకీయ పార్టీల వేదికను ఎంచుకున్నారు. వ్యక్తిగత ప్రజాదరణను రాజకీయ పార్టీగా మార్చి ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకున్న పరిస్థితులు కనిపించలేదు.

### • ప్రజారాజ్యం నేర్పిన రాజకీయాల అసలు పాఠం

అలాంటి సమయంలో మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించడం తెలుగు రాజకీయాల్లో ఒక కొత్త ప్రయోగంగా నిలిచింది. తొలి దశలో అపారమైన ప్రజా స్పందన కనిపించింది. సభలకు జనసందోహం తరలివచ్చింది. అభిమానుల్లో అపారమైన ఆశలు చిగురించాయి. అయితే సభలకు వచ్చిన జనమే ఓటు రూపంలో మారలేదు. ప్రజాదరణ, ఓటు బ్యాంకు రెండు వేర్వేరు అంశాలని ఎన్నికల ఫలితాలు స్పష్టంగా చూపించాయి. అనంతరం ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనమవడంతో ఆ రాజకీయ ప్రయోగానికి ముగింపు పలికింది.

ఈ పరిణామం ఒక స్పష్టమైన సందేశాన్ని మిగిల్చిందని చెప్పుకోక ఒప్పుకోక తప్పదు. అదేంటంటే సినిమా అభిమానాన్ని రాజకీయ విజయంగా మార్చాలంటే గ్లామర్ ఒక్కటే సరిపోదని. చిరంజీవి తర్వాత అదే మెగా కుటుంబం నుంచి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారు. మొదటి ఎన్నికల్లో ఆయన ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేదు. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కూటమి రాజకీయాలు, వ్యూహాత్మక నిర్ణయాల ద్వారా తన రాజకీయ స్థావరాన్ని క్రమంగా విస్తరించుకున్నారు.

### • ఇమేజ్ కాదు కూటమే విజయానికి కీలకం

చివరకు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం , భారతీయ జనతా పార్టీతో కలిసి పోటీ చేశారు. అధికారంలో భాగస్వామిగా నిలిచి డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పరిణామం కూడా మరో కీలక విషయాన్ని నిరూపించింది. ఏపీలో సినిమా ఇమేజ్ రాజకీయాలకు తలుపులు తెరవొచ్చు. కానీ అధికారాన్ని అందించేది రాజకీయ సమీకరణాలే. ఒక పార్టీ బలం, మరో పార్టీ కేడర్, మూడో పార్టీ ఓటు బదిలీ.. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే విజయం సాధ్యమవుతుంది. వ్యక్తిగత ప్రజాదరణ ఒక్కటే సరిపోదనే సత్యం తేలిపోయింది. ఇదే సమయాన తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం దక్షిణ భారత రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. తమిళ రాజకీయాల్లో ఆయన భవిష్యత్తుపై జరుగుతున్న విశ్లేషణలు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రతిధ్వనించాయి. సోషల్ మీడియా వేదికగా "విజయ్ చేయగలిగితే మన హీరోలు ఎందుకు చేయలేరు?" అనే ప్రశ్నలు వినిపించాయి. అక్కడి రాజకీయ పరిణామాలను ఇక్కడి పరిస్థితులతో పోల్చే ప్రయత్నాలు మొదలయ్యాయి.

### • జూనియర్, అల్లు ప్రచారం వెనుక రాజకీయ లెక్కలు

అక్కడి నుంచే తెలుగు రాజకీయాల్లో మరో చర్చ తెరపైకి వచ్చింది. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తారా? కొత్త పార్టీ పెడతారా? అల్లు అర్జున్ కూడా రాజకీయ అరంగేట్రం చేస్తారా? అనే ఊహాగానాలు సోషల్ మీడియా నుంచి రాజకీయ వేదికల వరకు విస్తరించాయి. అయితే జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన ప్రచారాలను ఆయన కార్యాలయం స్పష్టంగా ఖండించింది. అల్లు అర్జున్ విషయంలోనూ అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. అయినప్పటికీ ప్రచారం ఆగలేదు. ఎందుకంటే రాజకీయాల్లో వాస్తవాల కంటే ప్రచారం కొన్నిసార్లు ఎక్కువ కాలం జీవిస్తుంది. అయితే ఈ ప్రచారాలన్నింటి కంటే ముఖ్యమైన ప్రశ్న ఒక్కటే. ఒకవేళ రేపు ఏదైనా ప్రముఖ సినీ హీరో నిజంగానే పార్టీ పెడితే... అది ఎవరికి రాజకీయ లాభం? ఎవరికి నష్టం? ఆ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే 2024 ఎన్నికల ఫలితాల దగ్గర నుంచి రాజకీయ సమీకరణాలను మళ్లీ పరిశీలించాల్సిందే.

ఒకవేళ కొత్త సినీ పార్టీ ఆవిర్భవిస్తే... అది ఎవరికి రాజకీయంగా మేలు చేస్తుంది? ఎవరికి నష్టం కలిగిస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే ముందు 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల తీర్పును మరోసారి నిశితంగా పరిశీలించాల్సిందే.

### కూటమి గెలిచినా... చెక్కుచెదరని వైసీపీ ఓటు బ్యాంక్

2024 ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చేశాయి. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి అపూర్వ విజయాన్ని సొంతం చేసుకోగలిగింది. మొత్తం 175 స్థానాల్లో 164 స్థానాలను గెలుచుకుని చరిత్రలో నిలిచిపోయే మెజారిటీని సాధించింది. మరోవైపు ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. సీట్ల లెక్కలో ఇది ఏకపక్ష తీర్పులా కనిపించినా, ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే మరో రాజకీయ విస్ఫోట చిత్రం కనిపిస్తుంది. ఎన్నికల్లో గెలుపు సీట్లతో నిర్ణయించబడుతుంది. కానీ రాజకీయ బలం కేవలం సీట్లతో కొలవలేం. ఓట్ల శాతం కూడా అంతే కీలకం. 2024 ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మధ్య ఓట్ల వ్యత్యాసం సుమారు 10% పరిధిలోనే ఉండటం.. మూడు పార్టీలు కలిసి పనిచేయడాన్ని చూడాల్సి ఉంటుంది. అంటే అధికారాన్ని కోల్పోయినా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీకి గణనీయమైన ఓటు బ్యాంక్ ఇప్పటికీ ఉందనే సంకేతాన్ని ఆ గణాంకాలు ఇస్తున్నాయి.

### • ఓటుబ్యాంక్ కాపాడుకునేలా జగన్ ఎత్తుగడ

అందుకే రాజకీయ విశ్లేషకులు ఒక విషయాన్ని తరచూ ప్రస్తావిస్తున్నారు. 2024లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీట్ల పరంగా భారీగా ఓడిపోయింది. కానీ ఓటు బ్యాంక్ పూర్తిగా దెబ్బతినలేదు. ఈ రెండు అంశాల మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోకుండా భవిష్యత్ రాజకీయాలను అంచనా వేయడం కష్టమని వారు చెబుతున్నారు. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ రాజకీయంగా రక్షణాత్మక వైఖరిని అవలంబిస్తారని చాలామంది భావించారు. కానీ అందుకు భిన్నంగా ఆయన చాలా తక్కువ వ్యవధిలోనే ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభించారు. జిల్లాల పర్యటనలు, పార్టీ శ్రేణులతో సమావేశాలు, ప్రభుత్వంపై విమర్శలు, ప్రజా సమస్యలపై స్పందన.. ఈ చర్యలన్నీ 2029 ఎన్నికల దిశగా ముందస్తు రాజకీయ సన్నాహకాలుగా కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం చాలా ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల్లో నిరంతర ఉనికిని కొనసాగించాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది.
రాజకీయాల్లో అధికారాన్ని నిలబెట్టుకోవడం ఎంత కష్టమో, ప్రతిపక్షాన్ని సజీవంగా ఉంచుకోవడం కూడా అంతే సవాలు. ప్రస్తుతం జగన్ అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పార్టీ ఓటమితో నిరాశ చెందిన కేడర్‌లో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపడం, ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగించడం, ప్రభుత్వంపై ప్రత్యామ్నాయ కథనాన్ని నిర్మించడం వంటి అంశాలపై ఆయన దృష్టి కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది.

### కొత్త పార్టీతో మారేది ఎవరి ఓటుబ్యాంక్

ఇదే సమయంలో అధికార కూటమి కూడా మరో సవాలును ఎదుర్కొంటోంది. భారీ మెజారిటీతో గెలిచిన ప్రభుత్వం నుంచి ప్రజల అంచనాలు కూడా అంతే భారీగా ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగాల కల్పన.. ప్రతి అంశంలో ప్రభుత్వం తన పనితీరును నిరూపించుకోవాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వానికి ఇది సహజమైన రాజకీయ పరీక్ష. ఇలాంటి సమయంలోనే కొత్త సినీ పార్టీపై జరుగుతున్న చర్చ రాజకీయంగా ఆసక్తికరంగా మారుతోంది. ఒక కొత్త రాజకీయ పార్టీ ఏర్పడితే అది ఎవరికి ఓట్లు చీలుస్తుంది? అనే ప్రశ్నకు ఇప్పుడే ఖచ్చితమైన సమాధానం చెప్పడం సాధ్యం కాదు. ఎందుకంటే అది పార్టీ నాయకత్వం, విధానాలు, సామాజిక మద్దతు, స్థానిక నాయకుల చేరికలు, ఎన్నికల నాటి పరిస్థితులు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయితే రాజకీయ విశ్లేషణల్లో వినిపిస్తున్న ఒక వాదన ఏమిటంటే, ఇప్పటికే స్థిరమైన మద్దతు ఉన్న ప్రధాన ప్రతిపక్షం కంటే, తటస్థ ఓటర్లు.. అధికార కూటమికి మొగ్గుచూపే వర్గాల నుంచే కొత్త పార్టీకి కొంత మద్దతు లభించే అవకాశం ఎక్కువగా ఉండవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో మరో వర్గం విశ్లేషకులు, కొత్త పార్టీ సామాజికంగా ఏ వర్గాలను ఆకర్షిస్తుందన్నదే అసలు నిర్ణయాత్మక అంశమని అభిప్రాయపడుతున్నారు.

### గ్లామర్ కాదు ఓటు నిర్ణయించేది విశ్వాసమే

ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తాయి. అదే విధంగా నాయకుడిపై ఉన్న వ్యక్తిగత నమ్మకం, పార్టీ కేడర్ బలం, స్థానిక అభ్యర్థుల ప్రభావం కూడా ఓటు నిర్ణయంలో ప్రధాన అంశాలుగా ఉంటాయి. అందువల్ల కేవలం సినీ అభిమానాన్ని రాజకీయ మద్దతుగా భావించడం వాస్తవికతకు విరుద్ధంగా భావించాల్సి ఉంటుంది. ఇక్కడ మరో అంశం కూడా గమనించాలి. ఒక హీరోకు సినిమా అభిమానులు ఉండటం ఒక విషయం. కానీ అదే అభిమానులు అందరూ ఒకే రాజకీయ నిర్ణయం తీసుకుంటారని అనుకోవడం వాస్తవ రాజకీయాలకు దూరంగా ఉండే అంచనా. ఒకే కుటుంబంలో నలుగురు ఒకే హీరో అభిమానులు కావచ్చు. కానీ ఎన్నికల్లో నలుగురూ ఒకే పార్టీకి ఓటు వేయకపోవచ్చు. ఎందుకంటే ఓటు వేయించే సమయంలో స్థానిక సమస్యలు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమం, అభ్యర్థి వ్యక్తిత్వం వంటి అంశాలు ముందుకు వస్తాయి. ఈ నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ గానీ, అల్లు అర్జున్ గానీ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం సహజంగానే చర్చకు దారితీస్తోంది. అయితే ప్రస్తుతం అలాంటి నిర్ణయాలు ఊహాగానాలు మాత్రమే... కాబట్టి ఈ ప్రచారాలను రాజకీయంగా ఉత్తుత్తివిగానే భావించక తప్పదు. కానీ.. కొన్ని సందర్భాల్లో ఊహాగానాలే కొత్త సమీకరణాలకు దారితీసే వాతావరణాన్ని సృష్టిస్తాయి. అందుకే అలాంటి చర్చకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఈ పరిస్తితుల్లోనే ఏపీ రాజకీయాల అసలు స్వభావం మరోసారి గుర్తుకు వస్తుంది. రాష్ట్రంలో గ్లామర్ ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ ఓటును నిర్ణయించేది ప్రజల అనుభవం. స్టార్ ఇమేజ్ సభలకు జనాన్ని తీసుకురావచ్చు. కానీ ఎన్నికల్లో విజయాన్ని అందించేది ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన రాజకీయ నిర్మాణమే. అదే ఈ నేల రాజకీయాల ప్రత్యేకత.



### • చరిత్ర నేర్పిన రాజకీయాల అసలు పాఠం

చరిత్ర కూడా అదే చెబుతోంది. ఎన్టీఆర్ విజయం కేవలం సినీ గ్లామర్ విజయం కాదు.. అది ఒక రాజకీయ ఉద్యమ విజయం. చిరంజీవి ప్రయోగం గ్లామర్‌కు ఉన్న పరిమితులను గుర్తు చేసింది. పవన్ కళ్యాణ్ ప్రయాణం మాత్రం మరో పాఠాన్ని నేర్పింది. రాజకీయాల్లో నిలవాలంటే సహనం, క్రమశిక్షణ, వ్యూహం, దీర్ఘకాలిక నిర్మాణం అవసరమని ఆయన రాజకీయ ప్రయాణం చూపించింది. ఈ మూడు ఉదాహరణలే ఆంధ్ర రాజకీయాల అసలు స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి సరిపోతాయి. అందుకే తమిళనాడులో జరిగే ప్రతి రాజకీయ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్‌కు యథాతథంగా వర్తింపజేయడం సరికాదు. ప్రతి రాష్ట్రానికి తనదైన రాజకీయ చరిత్ర ఉంటుంది. తనదైన సామాజిక నిర్మాణం ఉంటుంది. తనదైన ఓటరు మనస్తత్వం ఉంటుంది. తమిళనాడులో పనిచేసిన రాజకీయ సూత్రం, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాగే పనిచేస్తుందని ముందుగానే నిర్ణయించుకోవడం వాస్తవాలను సరళీకరించడమే అవుతుంది. ఈ నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ రాజకీయ ప్రవేశంపై వినిపిస్తున్న ప్రచారాలను కూడా అదే కోణంలో చూడాలి. అధికారిక ప్రకటనలు లేనంతవరకు అవి ఊహాగానాలే. అయితే అలాంటి ప్రచారాలు రాజకీయ చర్చలకు దారితీయడం సహజం. ఎందుకంటే ప్రజాదరణ కలిగిన వ్యక్తుల గురించి రాజకీయ వర్గాల్లో ఆసక్తి ఉండటం ప్రజాస్వామ్యంలో కొత్త విషయం కాదు.

### • చప్పట్లు స్టార్‌కు... ఓట్లు నాయకుడికే!

కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పక తప్పదు. ఒక కొత్త పార్టీ ఏర్పడితే రాజకీయ సమీకరణాలు మారవచ్చు. కొన్ని వర్గాల ఓటు చీలవచ్చు. కొత్త చర్చలు మొదలవచ్చు. కానీ చివరికి ప్రజలు ఎవరికి అధికారాన్ని అప్పగించాలనే నిర్ణయం తీసుకునేది సినిమా పోస్టర్లు చూసి కాదు... గత పాలనను, ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, భవిష్యత్తుపై ఉన్న నమ్మకాన్ని బేరీజు వేసిన తర్వాతే. అదే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల ప్రత్యేకత.
ఇక్కడ చప్పట్లు స్టార్‌కు పడతాయి... కానీ ఓట్లు నాయకుడికి పడతాయి. ఇక్కడ అభిమానం సభలను నింపుతుంది... కానీ విశ్వాసమే బ్యాలెట్ పెట్టెను నింపుతుంది. ఇక్కడ భారీ కటౌట్లు ప్రజల దృష్టిని ఆకర్షిస్తాయి... కానీ ప్రజల జీవితాలను తాకిన నాయకత్వమే అధికారాన్ని అందుకుంటుంది. అందుకే ఆంధ్ర రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే ఒక్క సినిమా చరిత్ర సరిపోదు. ప్రజల చరిత్రను చదవాలి. ఒక్క స్టార్‌డమ్‌ను కొలిస్తే సరిపోదు. ప్రజల సెంటిమెంట్‌ను అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఈ నేలపై ఎన్నికలను గెలిపించేది గ్లామర్ కాదు... ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన రాజకీయ నమ్మకం. అదే ఆంధ్ర రాజకీయాల అసలు శైలి. అదే ఈ నేల రాజకీయాల శాశ్వత సంతకం.



# ట్రంప్–నెతన్యాహూ మధ్య చిచ్చు

- అమెరికా–ఇజ్రాయెల్ బంధంలో చీలిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం కావాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రయత్నించినప్పటికీ, ఆ భేటీకి వైట్ హౌస్ నుంచి స్పష్టమైన అంగీకారం రాలేదని అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. వచ్చే వారం అమెరికా పర్యటనకు నెతన్యాహూ సిద్ధమైనా, సమావేశం ఖరారు కాకపోవడంతో ఆ పర్యటనను రద్దు చేసినట్లు సమాచారం. వైట్ హౌస్ అధికారులు కూడా భేటీ అధ్యక్షుడి షెడ్యూల్‌లో ఎప్పుడూ ఖరారు కాలేదని పేర్కొన్నట్లు కథనాలు తెలిపాయి.

### హత్య కుట్ర సమాచారంపై సందేహాలు

ట్రంప్ టర్కీకి ఎఫ్35 యుద్ధ విమానాల విక్రయాన్ని పరిశీలిస్తున్న సమయంలో నెతన్యాహూ బహిరంగంగా విమర్శలు చేయడం అమెరికా అధ్యక్షుడికి అసంతృప్తి కలిగించినట్లు సమాచారం. టర్కీకి ఈ అధునాతన యుద్ధ విమానాలు ఇవ్వడం సరైన నిర్ణయం కాదని నెతన్యాహూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ట్రంప్ తీవ్రంగా తీసుకున్నారని, విదేశాంగ అంశాల్లో ఇజ్రాయెల్ ప్రధాని జోక్యం అవసరం లేదని భావించినట్లు అమెరికా అధికార వర్గాల సమాచారం. ట్రంప్ టర్కీ పర్యటనలో ఉన్న సమయంలో ఆయనపై ఇరాన్ హత్యాయత్నం జరిగే అవకాశం ఉందంటూ ఇజ్రాయెల్ అమెరికాకు నిఘా సమాచారం అందించినట్లు వార్తలు వచ్చాయి. ఈ హెచ్చరికతో భద్రతా సంస్థలు అప్రమత్తమై కొన్ని అదనపు జాగ్రత్తలు తీసుకున్నాయి. అయితే తర్వాత అమెరికా అధికారులు ఆ సమాచారానికి బలమైన ఆధారాలు లేవని తెలిపారు. టర్కీ భద్రతా సంస్థలు కూడా విచారణ జరిపి అలాంటి కుట్రకు స్పష్టమైన ఆధారాలు కనిపించలేదని వెల్లడించినట్లు సమాచారం.

### వాషింగ్టన్‌లో పెరుగుతున్న అసంతృప్తి

ఇరాన్ యుద్ధంపై నెతన్యాహూ చేసిన అంచనాలు నిజం కాలేదని అమెరికా అధికార వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోందని కథనాలు పేర్కొంటున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఇరాన్ విధానంపై ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసేందుకు నెతన్యాహూ ప్రభుత్వంలోని కొందరు ప్రయత్నించారని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య విభేదాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు అందిస్తున్న మూడు బిలియన్ డాలర్ల అమెరికా సాయాన్ని తగ్గించాలని ప్రతినిధుల సభలో పలువురు డెమోక్రటిక్ సభ్యులు కోరడం కూడా చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ట్రంప్, నెతన్యాహూ మధ్య విభేదాలపై వైట్ హౌస్ గానీ, ఇజ్రాయెల్ ప్రభుత్వం గానీ అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం వెలువడుతున్న సమాచారం ఎక్కువగా అమెరికా మీడియా కథనాలు, అధికార వర్గాల వ్యాఖ్యల ఆధారంగానే ఉంది.

# నీట్ రీ-టెస్ట్‌కు భారీగా డుమ్మా

- 2.79 లక్షల మంది గైర్హాజరు




దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ రీపరీక్షలో రికార్డు స్థాయిలో అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 2,79,848 మంది పరీక్షకు హాజరుకాలేదు. ఈ సంఖ్య ఇప్పటివరకు నమోదైన అత్యధిక గైర్హాజరు. మే 3న జరిగిన అసలు పరీక్షకు 22.05 లక్షల మంది హాజరుకాగా, జూన్ 21న నిర్వహించిన రీపరీక్షకు 19,99,895 మంది మాత్రమే హాజరయ్యారు.

### పేపర్ లీక్‌తో రద్దైన పరీక్ష, గణనీయంగా తగ్గిన హాజరు

మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలతో వివాదాస్పదమైంది. ఈ ఆరోపణల నేపథ్యంలో జాతీయ పరీక్షల సంస్థ పరీక్షను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ పరిణామాల తర్వాత జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. తాజాగా జూలై 16న ఫలితాలను ప్రకటించారు. అసలు పరీక్షలో హాజరు శాతం 96.72గా నమోదైంది. రీపరీక్షలో అది 87.72 శాతానికి పడిపోయింది. కరోనా మహమ్మారి సమయంలో 2020లో నమోదైన హాజరు తర్వాత ఇదే అత్యల్ప స్థాయిగా అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 22.79 లక్షల మంది నమోదు చేసుకున్నప్పటికీ, పరీక్ష కేంద్రాలకు చేరుకున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

### ఆన్‌లైన్ పరీక్షల దిశగా అడుగులు

జాతీయ పరీక్షల సంస్థ ప్రకటించిన ఫలితాల ప్రకారం 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. దేశంలో ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం సుమారు 1.08 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో దాదాపు 56 వేల ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉండగా, మరో 52 వేల సీట్లు ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయి. బీడీఎస్, ఆయుర్వేదం, యునానీ, సిద్ధ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నీట్ ఫలితాలనే పరిగణనలోకి తీసుకుంటారు. పేపర్ లీక్ వివాదం తర్వాత కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై నీట్ యూజీ పరీక్షను సంప్రదాయ పెన్‌పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ అంశంపై విద్యాశాఖ, ఆరోగ్యశాఖ మధ్య కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. పరీక్షల్లో పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం లక్ష్యంగా ఈ మార్పులు తీసుకొస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# అభివృద్ధికి బ్యాంకుల భాగస్వామ్యం

- రుణాలతో కొత్త కొత్త అవకాశాలు
- నరసరావుపేటలో భారీ రుణ మేళా
- బ్యాంకులకు చంద్రబాబు పిలుపు



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు కీలక భాగస్వాములుగా ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించే విధానం అభినందనీయమని చెప్పారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకు రుణాలు ప్రధాన ఆధారమని వివరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణ మేళాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

### లక్ష మందికిపైగా లబ్ధిదారులకు రుణాలు

ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లాకు చెందిన 1,03,246 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. 15 వేల మంది డ్వాక్రా మహిళలకు, 13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించారు. సామాన్యులు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని చంద్రబాబు చెప్పారు. పల్నాడును పారిశ్రామిక అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు.

### రుణాల రీ షెడ్యూల్‌తో భారీ ఆదా

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఇబ్బందుల్లో పడిందని ముఖ్యమంత్రి విమర్శించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల వల్ల రాష్ట్రంపై భారమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర సహకారంతో ఆ రుణాలను రీ షెడ్యూల్ చేయడం వల్ల రూ.1,538 కోట్లు ఆదా చేశామని వివరించారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు వంటి కీలక ప్రాజెక్టులకు వేగం పెరిగిందని తెలిపారు.

### రాయలసీమకు ఉద్యాన హబ్ లక్ష్యం

వీబీజీ రామ్ జీ పథకం కింద రాష్ట్రానికి రూ.7,707 కోట్లు అందనున్నాయని చంద్రబాబు వెల్లడించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల ఆర్థిక సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రైవేటు పెట్టుబడులను కూడా ఆకర్షించి ఉద్యాన రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

### మహిళల ఆర్థిక శక్తికి కొత్త ఊతం


మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో ముందంజలో ఉన్నాయని చెప్పారు. రుణాల తిరిగి చెల్లింపులో 99.5 శాతం విజయశాతం నమోదు చేయడం మహిళల క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒక మహిళ వ్యాపారవేత్తగా ఎదిగేలా "వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

### నిర్మలా సీతారామన్‌కు ప్రశంసలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకింగ్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని చంద్రబాబు కొనియాడారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి వ్యవస్థను బలోపేతం చేశారని చెప్పారు. డిజిటల్ బ్యాంకింగ్ విస్తరణ, జన్ ధన్ యోజన, జీఎస్టీ సరళీకరణ వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాలను మరో ఆరు జిల్లాల్లో కూడా నిర్వహించేందుకు కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు.

### సామాజిక సేవలకు బ్యాంకుల చేయూత

రుణాల పంపిణీతో పాటు పలు ప్రజా ఉపయోగ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి అందించింది. నాబార్డు సహకారంతో డీసీసీబీకి రూ.25 లక్షల విలువైన రెండు మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. 301 మంది విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన సైకిళ్లు పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు రెండు బ్యాటరీ వాహనాలు అందజేశారు. దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్లు కూడా పంపిణీ చేశారు. సభకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.



# విశ్వవిద్యాలయాల్లో పారదర్శక నియామకాలు

### ప్రక్రియ పారదర్శకంగా జరపాలన్న లోకేశ్

ఉండవల్లిలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగాలని ఆదేశించారు. వైస్ ఛాన్స్‌లర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. నియామకాలలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా, ఆరోపణలు వచ్చినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడుతున్న పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరులను సిద్ధం చేయాలని అధికారులను నారా లోకేష్ ఆదేశించారు. ఐటీఐలను పరిశ్రమలతో అనుసంధానం చేసి స్కిల్ గ్యాప్‌ను తగ్గించే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. విద్య, నైపుణ్యం, పరిశ్రమల మధ్య సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# అందరికీ అందుబాటులో

- అర్హులందరికీ బ్యాంకు రుణాలు
- రుణాల పంపిణీలో కొత్త సంస్కృతి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- నరసరావుపేటలో మెగా రుణ మేళా

అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకు రుణాలు అందేలా దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.3,216 కోట్ల విలువైన రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా లక్ష మందికిపైగా నేరుగా ప్రయోజనం పొందగా, వారి కుటుంబాలతో కలిపి దాదాపు ఐదు లక్షల మందికి మేలు జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది.

### బ్యాంకింగ్ సంస్కృతిలో భారీ మార్పు

2004 నుంచి 2014 వరకు ఫోన్ కాల్స్ ఆధారంగా కొందరికి మాత్రమే రుణాలు మంజూరయ్యేవని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ప్రభావశీలుల సిఫార్సులతో అర్హతను పక్కనపెట్టి రుణాలు ఇచ్చే పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. గ్రామాలకు బ్యాంకులే వెళ్లి అర్హులైన వారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. తాకట్టు లేకుండానే చిన్న వ్యాపారులకు రుణాలు మంజూరు చేసే విధానం అమలులోకి రావడంతో ప్రజల్లో బ్యాంకులపై విశ్వాసం పెరిగిందని వివరించారు.

### ప్రైవేటు అప్పుల నుంచి విముక్తి

ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలతో చిన్న వ్యాపారులు అధిక వడ్డీకి ప్రైవేటు అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రభుత్వ హామీతో బ్యాంకులు సులభంగా రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే యువత, మహిళలకు సులభంగా ఆర్థిక సహాయం అందడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

# కరోనా టెర్రర్

- 20 రోజుల్లో 12 కేసులు
- నాలుగు మరణాలు
- కొత్త వేవ్ కాదంటున్న వైద్యులు




ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 26 నుంచి జూలై 16 వరకు 12 కరోనా కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే రాష్ట్రంలో కరోనా మళ్లీ విస్తృతంగా వ్యాపిస్తోందని భావించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నమోదైన కేసులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని పేర్కొన్నారు.

### కొత్త కరోనా వేవ్ కాదంటున్న నిపుణులు

ఇటీవల నమోదైన కేసులు కొత్త కరోనా వేవ్‌కు సంకేతం కాదని వైద్య నిపుణులు తెలిపారు. రోగనిరోధక శక్తి తగ్గడం, వైరస్‌లో స్వల్ప మార్పులు, పరీక్షల సంఖ్య పెరగడం వంటి కారణాలతో అప్పుడప్పుడు కొత్త కేసులు వెలుగులోకి రావడం సహజమేనని వివరించారు. కరోనా వైరస్ పూర్తిగా అంతరించిపోలేదని, తక్కువ స్థాయిలో కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు.

### అధిక ప్రమాదం ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి

మధుమేహం, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. జ్వరం, దగ్గు, శ్వాస ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు.

### నిఘా, పరీక్షలు కొనసాగుతున్నాయి

రాష్ట్ర ఆరోగ్య శాఖ కరోనా పరిస్థితిపై నిరంతరం నిఘా కొనసాగిస్తోంది. పరీక్షలు, కాంటాక్ట్ ట్రేసింగ్ చర్యలను మరింత వేగవంతం చేసింది. కొత్త కేసుల మధ్య సంబంధం ఉందా లేదా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సాధారణ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# స్విమ్స్ నియామకాలపై ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సమీప బంధువైన ఆదిశేషయ్య ఈ మొత్తం నియామకాల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని భూమన ఆరోపించారు. స్విమ్స్ వైస్ ఛాన్సలర్, డైరెక్టర్‌ను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. టీటీడీ బోర్డు, ప్రభుత్వ అనుమతి, నిపుణుల కమిటీ నివేదిక లేకుండానే మార్పులు చేశారని విమర్శించారు. బర్డ్ సంస్థ డైరెక్టర్‌ను నియామక కమిటీకి అధ్యక్షుడిగా నియమించడం కూడా అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

### మెరిట్‌కు తూట్లు పొడిచారని విమర్శ

నియామకాల్లో రాత పరీక్ష మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టడం వెనుక అక్రమాల ఉద్దేశం ఉందని భూమన ఆరోపించారు. ప్రశ్నపత్రాల రూపకల్పనను జాతీయ స్థాయి నిపుణుల సంస్థలకు అప్పగించకుండా కొద్దిమంది సభ్యులతో కూడిన కమిటీకి బాధ్యతలు ఇచ్చారని అన్నారు. నోటిఫికేషన్ విడుదలైన రోజే ఉద్యోగాలు అమ్ముడయ్యాయనే ఆరోపణలు అభ్యర్థుల నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై



స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### టీటీడీ ప్రతిష్ఠ కాపాడాలని విజ్ఞప్తి

టీటీడీ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఇలాంటి పవిత్ర సంస్థల పరిధిలో జరిగే నియామకాలలో పారదర్శకత, ప్రతిభ, నిష్పాక్షికత తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. స్విమ్స్ నియామకాలతో పాటు ఇంజినీరింగ్, వేదపారాయణ పోస్టుల భర్తీపైనా వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించాలని కోరారు. ప్రభుత్వం మౌనం వీడి ఉన్నతస్థాయి స్వతంత్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఏనుగు ఆపరేషన్ విజయవంతం

## పలమనేరు ప్రజలకు ఊరట

పలమనేరు పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తూ గ్రామస్థులను భయాందోళనకు గురిచేస్తున్న ఒంటరి మగ అడవి ఏనుగును ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ విజయవంతంగా బంధించింది. సుమారు 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ ఏనుగును పట్టుకోవడానికి నెలరోజుల పాటు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలను పాటిస్తూ పశు వైద్య నిపుణులు, అటవీ అధికారులు పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు.

### డ్రోన్లు, థర్మల్ కెమెరాలతో నిఘా

ఏనుగు కదలికలను గుర్తించేందుకు అధునాతన డ్రోన్లు, థర్మల్ సెన్సర్ కెమెరాలను వినియోగించారు. క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, ట్రాకర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. తుది దశ ఆపరేషన్‌లో ముసలమడుగు శిబిరం నుంచి వచ్చిన ఐదు కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషించాయి. గతంలో ఏనుగు దాడికి గురై తీవ్రంగా గాయపడిన అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ కోలుకున్న తర్వాత తిరిగి ఈ ఆపరేషన్‌లో పాల్గొనడం విశేషంగా నిలిచింది.



### పవన్ కళ్యాణ్ అభినందనలు

ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అటవీ శాఖ అధికారులను, పశు వైద్య నిపుణులను, ట్రాకర్లను, మహౌత్‌లను ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. గాయాల నుంచి కోలుకుని విధుల్లో పాల్గొన్న సుకుమార్ ధైర్యసాహసాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజల భద్రతకు, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అటవీ శాఖ పనిచేసిందని పేర్కొన్నారు.

### కుంకీగా తీర్చిదిద్దే అవకాశాల పరిశీలన

పట్టుకున్న ఏనుగును ముసలమడుగు కుంకీ శిబిరానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. అక్కడ పశువైద్య పరీక్షలు పూర్తి చేసిన తర్వాత కొంతకాలం ఏనుగు ప్రవర్తనను పరిశీలించనున్నారు. మనుషులతో సానుకూలంగా మెలిగే లక్షణాలు కనిపిస్తే ప్రత్యేక శిక్షణ ఇచ్చి కుంకీ ఏనుగుగా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ విజయవంతమైన ఆపరేషన్‌తో పలమనేరు పరిసర గ్రామాల ప్రజలకు ఊరట లభించింది.

# రోహిత్‌కు చివరి ఛాన్స్?

### వన్డే భవితవ్యంపై ఉత్కంఠ



భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే కెరీర్ కీలక మలుపులో నిలిచినట్లు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు రోహిత్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని బీసీసీఐ ఎంపిక కమిటీలోని కొందరు సభ్యులు భావిస్తున్నట్లు సమాచారం. అఫ్గానిస్థాన్ సిరీస్‌కు ముందే ఈ విషయాన్ని రోహిత్‌కు తెలియజేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే అతని చివరి మ్యాచ్ కావచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే భారత క్రికెట్ ఉన్నతాధికారులు మాత్రం రోహిత్ వంటి అనుభవజ్ఞుడిని తొందరగా పక్కన పెట్టొద్దని సెలెక్టర్లకు సూచించినట్లు సమాచారం. మరోవైపు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సెలెక్టర్ల అభిప్రాయానికే మద్దతు ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో సెలెక్షన్ కమిటీలోని ఆర్పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా వంటి సభ్యులు రోహిత్‌కు అండగా నిలవవచ్చనే చర్చ జరుగుతోంది. దీంతో భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే రోహిత్ శర్మ మైదానంలో పరుగులతో పాటు ఎంపిక కమిటీలో మద్దతు కూడా సంపాదించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

## బీసీసీఐపై రోహిత్ అసంతృప్తి

### చివరి వన్డేపై సంచలన కథనం

భారత వన్డే జట్టు భవిష్యత్తుపై బీసీసీఐ తీసుకున్న నిర్ణయం రోహిత్ శర్మను అసంతృప్తికి గురిచేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ మధ్యలోనే రోహిత్‌తో సెలెక్షన్ కమిటీ, కోచ్ గౌతమ్ గంభీర్ సమావేశమై తమ నిర్ణయాన్ని వివరించినట్లు సమాచారం. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి రోహిత్ వయసు 40 దాటుతుండటంతో యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే అతని చివరి మ్యాచ్ కావచ్చనే ప్రచారం మరింత ఊపందుకుంది. మరోవైపు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు కల్పించాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు చెబుతున్నాయి. అయితే రిటైర్మెంట్ ప్రకటించాలా లేదా అనేది పూర్తిగా రోహిత్ వ్యక్తిగత నిర్ణయమేనని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. 286 వన్డేల్లో 11,731 పరుగులు సాధించిన రోహిత్ భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఓపెనర్లలో ఒకరిగా నిలిచాడు. ఇప్పుడు అతని అంతర్జాతీయ వన్డే ప్రయాణం ముగింపుకు చేరిందా అనే ప్రశ్న అభిమానుల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

# బీసీసీఐకి గవాస్కర్ హెచ్చరిక

### తొందరపాటు నిర్ణయాలు వద్దు

ఇంగ్లండ్ చేతిలో టీ20 సిరీస్‌లో ఘోర పరాజయం తర్వాత భారత జట్టుపై సమీక్ష చేపట్టనున్న బీసీసీఐకి మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ కీలక సూచనలు చేశారు. కొందరిపై వేటు పడే అవకాశముందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అలాంటి తొందరపాటు నిర్ణయాలు సరైనవి కావని హెచ్చరించారు. కేవలం నాలుగు నెలల క్రితమే భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచిందని, ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉందని గుర్తుచేశారు. కొన్ని ఓటముల ఆధారంగా పెద్ద మార్పులు చేయడం జట్టుకు మేలు చేయదని అభిప్రాయపడ్డారు. భారత బ్యాటర్ల సాంకేతిక లోపాలే ఇటీవలి వైఫల్యాలకు ప్రధాన కారణమని గవాస్కర్ విశ్లేషించారు. ముఖ్యంగా షార్ట్ బాల్స్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోతున్నారని చెప్పారు. దేశీయ టీ20 క్రికెట్‌లో చిన్న బౌండరీల కారణంగా బ్యాటర్లు తప్పుడు ఆత్మవిశ్వాసం పొందుతున్నారని పేర్కొన్నారు. భారత మైదానాల్లో పెద్ద బౌండరీలు ఏర్పాటు చేయాలని, అప్పుడే దక్షిణాఫ్రికా వంటి వేగవంతమైన పిచ్‌లపై మెరుగైన ప్రదర్శన సాధించి వన్డే ప్రపంచకప్ లక్ష్యాన్ని చేరుకోవచ్చని గవాస్కర్ సూచించారు.



# రోహిత్ రిటైర్మెంట్ సంకేతాలు

### కోహ్లీ, శాస్త్రికి ముందే తెలుసా?



భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే రిటైర్మెంట్‌పై ఊహాగానాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇంగ్లండ్‌తో రెండో వన్డే సందర్భంగా ప్రసారమైన కొన్ని దృశ్యాలు అభిమానుల్లో కొత్త సందేహాలకు కారణమయ్యాయి. రోహిత్, జస్ప్రీత్ బుమ్రా మధ్య కూర్చున్న విరాట్ కోహ్లీ దిగులుగా కనిపించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మొదట అది కోహ్లీ ఔటైన నిరాశగా భావించిన అభిమానులు, రోహిత్ రిటైర్మెంట్ వార్తల తర్వాత ఆ దృశ్యానికి మరో అర్థం చెబుతున్నారు. లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే రోహిత్‌కు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావచ్చని వార్తలు వస్తున్నాయి. మరోవైపు మ్యాచ్ వ్యాఖ్యానంలో రవి శాస్త్రి రోహిత్ కెప్టెన్సీ, ప్రపంచకప్‌లో అతని రికార్డులు, భారత క్రికెట్‌కు చేసిన సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించడం కూడా చర్చనీయాంశమైంది. దీంతో శాస్త్రికి ముందే రోహిత్ భవిష్యత్తుపై సమాచారం తెలిసి ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ వన్డే భవిష్యత్తుపై బీసీసీఐ త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం లార్డ్స్ వన్డేపైనే అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది.



# ఇంగ్లండ్ కోచ్ పదవికి నో నో

### ఆర్‌సీబీకే ఫ్లవర్ ప్రాధాన్యం

ఇంగ్లండ్ టెస్టు జట్టు ప్రధాన కోచ్ పదవిని మాజీ కోచ్, ప్రస్తుత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ తిరస్కరించారు. బ్రెండన్ మెకల్లమ్ వైదొలిగిన తర్వాత ఫ్లవర్ పేరు ప్రధానంగా వినిపించినా, తాను ప్రస్తుతం చేస్తున్న కోచింగ్ బాధ్యతలతో పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్‌సీబీతో పాటు ది హండ్రెడ్‌లో లండన్ స్పిరిట్ జట్టుతో పనిచేస్తుండటం తనకు ఆనందంగా ఉందని వెల్లడించారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీకి తెలియజేసినట్లు చెప్పారు. 2009 నుంచి 2014 వరకు ఇంగ్లండ్ ప్రధాన కోచ్‌గా పనిచేసిన ఫ్లవర్ స్వదేశంలో, విదేశాల్లో యాషెస్ సిరీస్‌లు గెలిపించడంతో పాటు భారత్‌లోనూ చారిత్రక విజయాన్ని అందించారు. అనంతరం ఫ్రాంచైజీ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌గా గుర్తింపు పొందారు. ప్రస్తుతం తన దృష్టి పూర్తిగా ఆర్‌సీబీ, లండన్ స్పిరిట్ జట్లపైనే ఉందని, ఇంగ్లండ్ టెస్టు కోచ్ బాధ్యతలు స్వీకరించే ఆలోచన లేదని స్పష్టంచేశారు. దీంతో కొత్త కోచ్ ఎంపిక ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుకు మరింత సవాలుగా మారింది.





# డిఫరెంట్ కాన్సెప్ట్ కథ.. ఓ.. సుకుమారి

ఈ వారం ప్రేక్షకులకు వినోదం పంచడానికి వచ్చిన చిత్రం 'ఓ..! సుకుమారి'. కథాబలమున్న సినిమాలతో ప్రయాణం చేసే తిరువీర్ కథానాయకుడు కాగా.. ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేశ్ ఆయనతో జోడీ కట్టడం, ప్రచార చిత్రాలూ, సినిమాలోని కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని ప్రముఖంగా ఆకర్షించిన అంశాలు. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లికి సిద్ధమవుతాడు. పక్క ఊరిలోని ఓ అమ్మాయిని చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేశ్)పై మనసు పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ ఊళ్లో కూడా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి సాగనంపాలనేది గ్రామస్తుల ప్లాన్. దానికి కారణం ఆమెకొక విచిత్రమైన సమస్య ఉండటమే. ఆమెను ముట్టుకోగానే షాక్ కొడుతుంది. ఆ సమస్య వల్ల ఊళ్లో వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు. అందుకే యాది ఇష్టపడటమే ఆలస్యం... ఆ ఊరంతా కలిసి దామిని పెళ్లిని ఘనంగా చేసి సాగనంపుతుంది. అసలు చిక్కులు ఆ తర్వాతే మొదలవుతాయి. ముట్టుకుంటేనే షాక్ కొట్టే దామినితో యాదగిరి కాపురం ఎలా చేశాడు? అత్తారింట్లో దామిని ఎలా కలిసిపోయింది? ఆమెకున్న షాక్ సమస్యని తన భర్త ఊరి జనాలు ఎప్పుడు ఎలా తెలుసుకున్నారు? యాది పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెనకున్న బలమైన ఆ కారణాలేమిటి? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. తిరువీర్ ఇటీవల నటించిన 'పాపం ప్రతాప'లో కథానాయకుడి పాత్రకు సమస్య ఉంటుంది. అది కూడా భార్యాభర్తల మధ్య కాపురానికి సవాల్‌గా నిలిచిన సమస్యే. ఇందులోనేమో కథానాయికకి సమస్య. ఈ రెండూ కూడా గ్రామీణ నేపథ్యంతో సాగే కథలే. మరికొన్ని సారూప్యతలూ కనిపిస్తాయి. ముట్టుకోగానే షాక్ కొట్టే ఓ అమ్మాయి... అది తెలియక ఆమెని పెళ్లి చేసుకున్న ఓ అబ్బాయి... ఆ ఇద్దరి మధ్య కలిసి కాపురం ఎలా సాగించారన్నది ఆసక్తిని రేకెత్తించే విషయమే.




## కియారాపై ట్రోల్స్..

• బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్'లోని 'తబాహి' వీడియో పాటపై ట్రోల్స్ వచ్చాయి. యశ్, కియారా మధ్య ఉన్న రొమాంటిక్ సన్నివేశాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. యశ్‌ను ప్రశంసిస్తూ.. కియారాను విమర్శించడంపై 'టాక్సిక'లో నటిస్తోన్న బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్ అద్భుతంగా కనిపించాడంటూ కామెంట్ సెక్షన్‌లో ఎమోజీలతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ కియారా విషయానికి వస్తే, ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 'పెళ్లి అయ్యాక కూడా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం అవసరమా' అని మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?. యశ్‌కు కూడా పెళ్లయింది.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేవలం నటీమణులపైనే ఎందుకు ఇంత దారుణంగా ట్రోలింగ్ జరుగుతోంది? వాస్తవాన్ని గ్రహించండి. వారు నటీనటులు. స్క్రీన్‌పై పాత్రలను పండించడం, కథకు తగ్గట్టుగా నటించడమే వారి పని' అని అన్నారు.



# సమంతకు సర్‌ప్రైజ్ సీమంతం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్ప్రైజ్ ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



### ఓటిటిలోకి వచ్చేసిన మా ఇంటి బంగారం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన సూపర్‌హిట్ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా 'మా ఇంటి బంగారం' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయాన్ని నమోదు చేసి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్న ఈ చిత్రం, తాజాగా ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'మా ఇంటి బంగారం' కేవలం 28 రోజులకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి రావడం విశేషం. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి రాజ్ నిడిమోరు స్క్రీన్‌ప్లే అందించారు. భావోద్వేగాలు, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి మహిళా ప్రధాన తెలుగు చిత్రాల్లో కొత్త రికార్డు సృష్టించింది. ఈ చిత్రంలో సమంత 'స్వర్ణ' పాత్రలో కనిపించింది. పెళ్లి తర్వాత తొలిసారి భర్త ఇంటికి వెళ్లిన ఓ యువతి, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి ప్రయత్నించే సమయంలో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గత జీవితానికి సంబంధించిన ఓ రహస్యం ఆమె జీవితాన్ని మలుపుతిప్పుతుంది. కుటుంబాన్ని కాపాడుకోవడానికి స్వర్ణ చేసిన పోరాటమే సినిమా ప్రధాన కథ.

# ప్రెగ్నెన్సీతోనే రాకా షూట్‌లో దీపికా పడుకొణె

బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న 'రాకా'లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో 'ఎనిమిది గంటల పని' నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. 'రాకా' కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, 'రాకా'లో తన షూటింగ్‌ను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్‌లో పాల్గొంటూనే తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ని ఇలా బ్యాలెన్స్ చేస్తుండడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌తో దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDENCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085